మాట్లాడనివ్వండి. నాలుగు రోజులయ్యాకా ఆలోచిద్దాము, ఇప్పుడు కొంపలు అంటుకుపోయింది ఏమీ లేదు కదా! ఇటువంటి వ్యవహారాలను సహించము. ఇప్పటికైనా టైం వేస్ట్ చేయడం అవసరం లేదు. అజెండాలోకి వెళ్దాము. ఈరోజు, రేపటిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను ముగించవలసి ఉంటుంది. ఎల్లుండి బడ్జెట్ ప్రవేశపెట్టవలసి ఉంది. ఒకటి రెండు రోజులు సస్పెండ్ చెయ్యవచ్చు కదా అంటున్నారు, ఒకటి రెండు రోజులు చూద్దాం, అప్పుడు ఆలోచిద్దాము. ఇప్పటికిప్పుడే మనం తొందరపాటు చర్య తీసుకోవలసిన అవసరం లేదు. దయచేసి తమరు అజెండాలోకి వెళ్లండి.

## వాయిదా తీర్మానాల అనుమతి గురించి

మిస్టర్ స్పీకర్ : ఈనాటి వాయిదా తీర్మానాలు.

1. వాయిదా ప్రతిపాదన ఇచ్చిన వారు శ్రీ కె. జానారెడ్డి గారు మరియు ఇతర సభ్యులు శాసన మండలి సభ్యుల పార్టీ ఫిరాయింపులు మరియు ప్రతిపక్షశాసన సభ్యుడిని మంత్రి వర్గంలో చేర్చుకున్న విషయం చర్చించుట గురించి.

2. వాయిదా ప్రతిపాదన ఇచ్చిన వారు శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు గారు మరియు ఇతర సభ్యులు పార్టీ ఫిరాయింపుదారులపై శాసన సభ్యులను అనర్హులుగా ప్రకటించాలని కోరినందుకు విపక్ష శాసన సభ్యులపై ఆరోపిత దాడిని ఖండిస్తూ ఇచ్చిన వాయిదా ప్రతిపాదనను తిరస్కరించడమైనది.

3. వాయిదా ప్రతిపాదన ఇచ్చిన వారు శ్రీ ఆర్. రవీంద్ర కుమార్ గారు రాష్ట్రంలో ఉన్న కరువు సమస్యను గుర్తించి ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించాలని, సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

4. వాయిదా ప్రతిపాదన ఇచ్చిన వారు శ్రీ సున్నం రాజయ్య గారు ఖమ్మం జిల్లా, వాజేడు, వెంకటాపురం మండలాల్లో కురిసిన అకాల వర్షాల వల్ల వేల ఎకరాలలో మిర్చి, మొక్కజొన్న పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

Now tea break for 10 minutes.
(The House adjourned at 12.07 pm for 10 minutes for tea break)

('టీ' విరామానంతరం సభ మధ్యాహ్నం 12.40 గంటలకు పునఃప్రారంభం అయ్యింది. గౌరవ సభాపతి అధ్యక్షస్థానంలో ఉన్నారు.)

## గవర్నరు గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై - చర్చ.

12.30 మ.

మిస్టర్ స్పీకర్ : శ్రీ ఆరూరి రమేష్ గారు

శ్రీ ఆరూరి రమేష్ : అధ్యక్షా, 7వ తేదిన జరిగిన గవర్నరు గారి ప్రసంగంపై మాట్లాడే అవకాశం ఈ రోజు నాకు కల్పించినందుకు మీకు, మీ ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారికి, గౌరవ శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి గారికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసుకుంటున్నాను. అదేవిధంగా నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అన్ని అడ్డంకులను ఛేదించుకుని అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని గవర్నరు గారు తన ప్రసంగంలో స్పష్టంగా చెప్పడం జరిగింది. మొట్టమొదటి సారిగా శాసనసభ సభ్యుడిగా వచ్చిన నాకు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదములు తెలియజేసే అవకాశాన్ని ఇచ్చినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. తెలంగాణను నవ తెలంగాణ, బంగారు తెలంగాణగా చేయాలనే సంకల్పం, పట్టుదలతో గడిచిన ఎనిమిది, తొమ్మిది నెలల కాలంలోనే ముఖ్యమంత్రి గారు పట్టుదలతో అనేక కార్యక్రమాలు చేసి చూపించడం జరిగిందనే విషయం గవర్నర్ గారి ప్రసంగం ద్వారా మనకు స్పష్టం అవుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకాలు ఏర్పడుతాయని, తెలంగాణ అభివృద్ధి చెందదని, తెలంగాణలో అనేక విప్లవ పార్టీలు వస్తాయని, సమైక్యాంధ్ర రాష్ట్రంలో ఉన్నప్పుడు ఈ ప్రాంత నాయకులే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సహకరించ లేదు. ఈ రోజు అలాంటి అపవాదు పోవాలని, తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు తీసుకవెళ్లాలని, ఐఏఎస్ అధికారులు, సరైన స్టాఫ్ లేకపోయినప్పటికి, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడపాలని ఒక్క చేతితో గౌరవ ముఖ్యమంత్రి గారు ఉన్న అధికారులతోనే రాష్ట్ర అభివృద్ధికి మొత్తం ప్రణాళికలు చేయడం జరిగింది.

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కొద్ది మంది అధికారులతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, తెలంగాణలో ఉన్నటువంటి ఒక్కో అంశాన్ని పరిష్కరించే దిశగా ముఖ్యమంత్రి గారు పని చేస్తున్నారు. తెలంగాణలో నూటికి 85శాతం మంది ప్రజలు బడుగు, బలహీన వర్గాల వారే ఉన్నారని, వారు అభివృద్ధి చెందితేనే నిజమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న వాళ్లం అవుతామని, 60 సంవత్సరములుగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నప్పటికీ, అభివృద్ధి జరగకపోతే ఎటువంటి లాభం ఉండదని ముఖ్యమంత్రి గారు "ఆసరా" పింఛను పథకాన్ని ప్రారంభించారు. తెలంగాణ సమైక్యాంధ్ర రాష్ట్రంలో ఉన్నప్పుడు ఎటువంటి ఆసరా లేని మన ముసలి తల్లులకు రూ.200

పింఛనుగా ఇచ్చేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పింఛను డబ్బులను రూ.200 నుంచి రూ.1000కు ముఖ్యమంత్రి గారు పెంచారు.

నా నియోజక వర్గంలోని ఒక గ్రామంలో పర్యటిస్తున్న సందర్భంలో నాతో ఒక ముసలి అవ్వ "నా పెద్దకొడుకు ఎక్కడున్నాడని అడిగితే, నీ పెద్ద కొడుకు గురించి నాకేం తెలుసని నేను చెబితే, ఏ ఆసరా లేని మాలాంటి ముసలి వాళ్లకు రూ.1000 పింఛను ఇచ్చి ఆదుకునే కేసీఆర్ గారే మా పెద్ద కొడుకని" ఆమె చెప్పడం జరిగింది. అదే విధంగా వికలాంగులైన వారి కుటుంబాలు బాగుపడటానికి, వికలాంగులు ఆత్మ గౌరవంతో బ్రతకడానికి వికలాంగులకు ఇచ్చే పింఛనును రూ.500 నుంచి రూ.1500 కు పెంచడం జరిగింది.

12.45 మ. అదే విధంగా వ్యవసాయంపై ఆధారుడి ఆర్థికంగా ఎదగాలని గతంలో ఎస్సి కులాల వారికి రెండు గుంటలు, మూడు గుంటలు నిరుపయోగంగా ఉన్న భూమి ఇచ్చిన విధంగా కాదు. వ్యవసాయానికి ఉపయోగపడే భూములను వ్యవసాయానికి యోగ్యంగా ఉన్న భూములను మూడు ఎకరాల భూమి ఇచ్చి ఒక మహిళ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి, ఆ కుటుంబానికి కావలసిన ఒక సంవత్సరం పెట్టుబడులు ప్రభుత్వమే అందించి వారు ఆర్థికంగా ఎదిగే విధంగా ఈ ప్రభుత్వం ముందుకు పోతున్నది.

(అంతరాయం)

వాళ్లు పలుమార్లు ఎన్నిక కాబడ్డ శాసనసభ్యులు. ఇంతకు ముందు అధికారంలో ఉన్న శాసనసభ్యులు చాలా సీనియర్ శాసనసభ్యులున్నారు. మేము కొత్త శాసనసభ్యులము. మాకు మాట్లాడడానికి అవకాశం ఇవ్వాలి. ఈ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు కావచ్చు, గవర్నర్ ప్రసంగంపైన ధన్యవాదాలు తెలుపుతున్నాము కాబట్టి ఈ రోజు మొత్తం తెలంగాణ రాష్ట్రం యావత్తు భారత దేశం ప్రపంచ దేశాలు మన రాష్ట్రం వైపు చూస్తున్నాయి. సంక్షేమ పథకాలే కాదు, కేసీఆర్‌గారు ఒక ఉద్యమ నేతగా తెలంగాణా ప్రాంతాన్ని అణువణువు తిరిగిన వ్యక్తి. ఆ కష్టాలు గుండెలో పెట్టుకొని, ఆ బాధను మనసులో పెట్టుకొని ఈ తెలంగాణా రాష్ట్ర విముక్తి కోసం, అభివృద్ధి కోసం అహర్నిశలూ ఆలోచన చేస్తున్న వ్యక్తి.. అందుకనే ఈ రోజు వాటర్‌గ్రిడ్ గురించి ఎవరు చెప్పలేదు, ఏ ఇంజనీర్లు ప్రతిపాదించలేదు, నల్గొండ జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు నల్గొండ బిడ్డలు ఎన్నో సంవత్సరాలుగా అంగవికలాంగులై బాధ పడుతున్నారు. వారికి స్వచ్ఛమైన నీరు అందించాల్సిన బాధ్యత మన పైన ఉన్నది. ఒకసారి ఆలోచన చేశారు. ఎన్నాళ్లైనా మిడ్‌మానేరు నుండి సిద్దిపేటకు స్వచ్ఛమైన నీటిని ఇంటింటికి అందించిన వ్యక్తి ముఖ్యమంత్రి. అదే ప్రతిపాదన తీసుకొని యావత్ తెలంగాణా రాష్ట్రంలో కూడా ఎవరూ అనారోగ్యంగా ఉండకూడదని, కావలసిన మంచినీరు అందిస్తే ఆరోగ్యం బాగుంటుందని,వైద్యులు చెబుతున్నారు. అలాంటి పరిస్థితులలో ఒక గొప్ప నాయకుడు, ఒక మొనగాడు నేను వచ్చిన నాలుగు సంవత్సరాలలో స్వచ్ఛమైన నీటిని ఇంటింటికి అందించక పోతే ఓట్లు అడుగనని చెప్పిన వ్యక్తి మన ముఖ్యమంత్రిగారు. మరి వారి ఉద్దేశ్యం ఎన్నికలు కాదు, ఓట్లు కాదు, ఈ రాష్ట్రంలో పుట్టిన ప్రతి బిడ్డ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆలోచనతో ఉన్న వ్యక్తి కెసిఆర్‌గారు. నాలుగు కోట్ల ప్రజలు ఎన్నుకున్న వ్యక్తి మన ముఖ్యమంత్రిగారు. ఆ ముఖ్యమంత్రిగారు ఈ రోజు ఈ ప్రజలకు కావలసిన సంక్షేమం కోసం చూస్తున్నారు.

(శ్రీ జి. కిషన్ రెడ్డి నుండి అంతరాయం)

ముఖ్యమంత్రిగారు అందిస్తున్న వాటర్ గ్రిడ్ కార్యక్రమం చాలా గొప్ప కార్యక్రమం . ఈ రాష్ట్రానికి నేను స్వచ్ఛమైన నీరు అందించాలి. ఈ రాష్ట్ర ప్రజలు మా ప్రభుత్వాన్ని తీసుకువచ్చారు. కాబట్టి ఈ ప్రజలకు ఒక మంచి చేయాలని ముఖ్యమంత్రిగారు వాటర్ గ్రిడ్‌ను ఒక మానస పుత్రికగా స్వీకరించడం జరిగింది.

(అంతరాయం)

శ్రీ కె. జానారెడ్డి: అధ్యక్షా, నేను ఎవరికీ అనుకూలంగా ఉండను. ప్రజాస్వామ్యానికి అనుకూలంగా ఉంటాను. నేను ప్రతిపక్ష నాయకుడిగా నా పాత్ర నిర్వహిస్తాను. అప్పుడప్పుడు ప్రభుత్వం చేసే తప్పులను ఎత్తి చూపిస్తాను. అందులో సందేహం లేదు. అయినా అప్పుడు అప్పుడు సభ నడపడానికి అడ్జస్ట్‌మెంట్ కావాలి. గౌరవ సభ్యుడు అంతకంటే ముందు నుంచి ఇప్పటి వరకు వారు క్లారిఫికేషన్ కొరకు నిలబడి ఉన్నారు. అది ఒకటి రెండు నిమిషాలలో అయిపోతుంది. రూల్సు పర్మిట్ చేస్తే, ఆయన అడగదలచుకున్నది అడుగుతాడు. ఒకవేళ వారు అడగదలచుకున్న విషయం సబ్జక్టుకు సంబంధించింది కాకపోయినా, సమంజసం కాకపోయినా తిరస్కరిస్తూ సభ్యులకు తెలియచేయాలి. సమంజసం అయితే వారు అర్థం చేసుకొని సహకరించవలసిన అవసరం ఉంది. నాకు తెలిసినంతవరకు వారు అడిగేదేమంటే, సస్పెండ్ చేసిన సభ్యుల గురించి .................

(అంతరాయం)

దాని పైన క్లారిఫికేషన్ కావాలి. అది సమంజసమైందా, కాదా అనేది మీరు జడ్జిమెంటు ఇస్తే సరిపోతుంది. సభకు అర్థమవుతుంది. లేదా సభ్యుడిని ఒక పార్టీ మొత్తాన్ని.......

మేము ఆ అంశం జోలికి వెళ్లదలచుకోలేదు. దయచేసి, ఇప్పటికైనా అందరూ సహకరించండి. ఈ అంశం పైన చర్చిద్దాము. ప్రజా సమస్యలపైన చర్చ జరగాలని ప్రజలు ఎదురు చూస్తున్నారు. అందువల్ల అజెండాలోకి వెళ్దాము. గవర్నర్ గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం పై మాట్లాడే అవకాశం వారికి ఉంది. సభను అడ్డుకోవడాన్ని ప్రజలు హర్షించరని మనవిచేస్తున్నాను.

### గవర్నరు గారి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ (కొనసాగింపు)

శ్రీ ఆరూరి రమేష్: అధ్యక్షా, 201314 లో 4.8 శాతం వృద్ధిరేటు ఉందని గవర్నర్ గారి ప్రసంగంలో చెప్పడం జరిగింది. 2014 15లో 5.3 శాతం అభివృద్ధిని అందుకోబోతున్నామని చెప్పారు. కొత్త రాష్ట్రం ఏర్పడితే, ఈ రాష్ట్రం అభివృద్ధి చెందదు, పరిశ్రమలు రావు, పవర్ ఉండదు అన్నారు. నీటి వసతి లేదు, ఓడరేవులు కాబట్టి రాష్ట్రం అభివృద్ధి చెందదని అప్పటి ప్రభుత్వాలు, నాయకులు, తెలంగాణను హీనమైన స్థితికి తీసుకెళ్లారు, ఆ విషయం మీకు తెలుసు. అతి తక్కువ సమయంలో గౌరవ ముఖ్యమంత్రి గారు రాష్ట్రాన్ని, ఇంత శాతం వృద్ధి రేటుకు తీసుకెళ్లారంటే వారి చిత్తశుద్ధి ఏ విధంగా ఉందో మనకు అర్థం అవుతుంది. కళ్యాణ లక్ష్మి పథకం గురించి మీకు తెలుసు. ఎస్.సి, ఎస్.టి, మైనారిటీ వర్గాలలోని ఎదిగిన ఆడపిల్లకు పెళ్లి చేయలేక ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలు చాలా ఉన్నాయి. వరంగల్ జిల్లా, ములుగు నియోజకవర్గంలో నియోజకవర్గ పర్యటనకు ముఖ్యమంత్రి గారు వచ్చినప్పుడు పేద వారి పెళ్లి కూడా ఘనంగా జరగాలని రూ. 51,000/ కళ్యాణ లక్ష్మి పథకం క్రింద ప్రకటించడం జరిగింది. ముస్లిం, సిక్కు వంటి మైనారిటీలకు షాదీముబారక్ పథకం క్రింద రూ. 51,000/ ప్రకటించడం జరిగింది. అదే విధంగా మధ్యాహ్న భోజన పథకం అధ్యక్షా. ఈనాడు ఏ హాస్టల్‌కు వెళ్లినా బ్రహ్మాండమైన సన్న బియ్యంతో భోజనం పెడుతున్నారు. మంచి కూరలతో కడుపు నిండా ఆ బిడ్డలు భోజనం చేస్తున్నారు. బిడ్డ కడుపులో ఉన్నాడని గ్రహించి, ఆ బిడ్డకు కేజీ నుండి పీజీ వరకు విద్యను అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గర్వకారణం. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. ఈ రాష్ట్రంలోని ప్రజలకు తాగునీరు అందించాలని వాటర్‌గ్రిడ్ కార్యక్రమం చేపట్టారు. దానికి సంబంధించిన సర్వేలు కూడా పూర్తయ్యాయి. పంచాయత్‌రాజ్ మినిస్టర్ గారు ప్రతి జిల్లాకు వెళ్లి పరిశీలించడం జరిగింది. అతి త్వరలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని అందించడానికి ప్రయత్నం చేస్తున్న ఈ ప్రభుత్వానికి చేతులెత్తి నమస్కరిస్తున్నాను. పది సంవత్సరాల నుండి రోడ్లను పట్టించుకోలేదు. మన నియోజకవర్గంలోని రోడ్లు ఏ విధంగా ఉన్నాయో తెలుసు. ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లోనే ప్రతి గ్రామంలోని బిటి రోడ్ల రెన్యువల్‌కి సంబంధించి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ఈ ప్రభుత్వం జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ఫోర్ లేన్ రోడ్లను ప్రతిపాదించింది.

1.15 మ. ఈ రాష్ట్రం అభివృద్ధి చెందాలని, ప్రగతి పథంలోకి ముందుకు వెళ్లాలని, రవాణా సౌకర్యం కూడా అవసరమని, ప్రతి ఒక్కరు రోడ్లపై ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రయాణించడానికి ఈ ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. తెలంగాణ రాష్ట్రం సమైక్యాంధ్రలో ఉన్నప్పుడు ఆ పాలకులు మైనర్ ఇరిగేషన్ గురించి మరిచిపోయారు. మైనర్ ఇరిగేషన్ పేరిట ఉన్నటువంటి కుంటలు, చెరువులు అన్యాక్రాంతం అయ్యాయి. ఈ చెరువులకు, కుంటలకు పూర్వ వైభవం తీసుకురావలని, కాకతీయుల కాలంలో ఉన్నటువంటి గొలుసు కట్టు చెరువులకు గత వైభవాన్ని మరల తీసుకువచ్చి గ్రామాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఈ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం "మిషన్ కాకతీయ" పథకాన్ని ప్రారంభించినందుకు ప్రభుత్వానికి నేను చెతులెత్తి నమస్కారాలు తెలియజేస్తున్నాను. "మిషన్ కాకతీయ" పథకాన్ని ఒక విప్లవం లాగా తీసుకొని ప్రతి ఒక్కరిని భాగస్వాములుగా చేసి చెరువుల పునరుద్ధరణలో భాగంగా చెరువుల యొక్క లోతును పెంచుకొని, చెరువు కట్టలను పటిష్టం చేసుకొని, కాలువలను, అన్యాక్రాంతమయిన చెరువులను పునరుద్ధరణ చేసుకొని ఆయకట్టులోని చివరి ఎకరానికి కూడా నీళ్లు అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని తీసుకురావడం జరిగింది. గ్రామాల్లో ఉండే ప్రజలకు చెరువులే జీవనాధారం. రాష్ట్రంలో 46వేలకు పైగా ఉన్నటువంటి చెరువుల్లో ఈ సంవత్సరం 9వేలకు పైగా చెరువులను పునరుద్ధరణ చేయడానికి టెండర్ల కార్యక్రమాన్ని చెపట్టారు. గౌరవ ముఖ్యమంత్రి గారి ఆలోచన ప్రకారం ఈ చెరువులన్నింటిని పునరుద్ధరణ చేసినట్లయితే 265 TMCల నీటిని మనం అదనంగా నిల్వ చేసుకోవచ్చు. ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటి పోయినందున బోర్లకు నీళ్లు అందడం లేదు. చెరువుల పునరుద్ధరణ చేసినట్లయితే భూగర్భ జలాలు పెరిగి ఈ బోరు బావుల్లోకి నీరు పుష్కలంగా వచ్చి వ్యవసాయానికి, కుల వృత్తులు చేసుకునే వారికి ఉపయోగపడి వారు కూడా సంతోషగా ఉండే పరిస్థితి వస్తుంది. చెరువుల విషయంలో ఆరోజున ఉన్న కాకతీయ రాజులను, గణపతి రాజులను మనం ఇప్పడికి కూడా మర్చి పోవడం లేదు. అధ్యక్షా, మీరు కూడా వరంగల్ జిల్లా వాసిగా మీకు కూడా రామప్ప, పాకాల గొలుసు కట్టు చెరువుల గురించి తెలుసు. గత ప్రభుత్వాలు, పాలకులు మరిచిపోయిన చెరువులను, కుంటలను ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే

పునరుద్ధరించటం ఎంత గొప్ప విషయమనేది మనం ఆలోచించుకోవాలి. చెరువులను పునరుద్ధరణ చేయడం వల్ల భూగర్భ జలాలను, ఆయకట్టును పెంచుకోవడమే కాకుండా, కుల వృత్తుల వారికి కూడా జీవనాధారం కలుగుతుంది మరియు తెలంగాణలో ఉన్న వ్యవసాయాధారిత కుటుంబాల వారు కూడా సంతోషంగా జీవించే పరిస్థితి ఉంది. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం బోరు బావుల మీద ఆధారపడి ఉంది. గతంలో ఉన్నటువంటి కరెంటు కష్టాలు ఇంకా మనని వెంటాడుతూనే ఉన్నాయి. కరెంటు కష్టాలు తీరాలి, కరెంటును ఉత్పత్తి చేయాలనే మహా సంకల్పంతో ముఖ్యమంత్రి గారు పనిచేస్తున్నారు. ఈ రోజు చెరువుల విషయంలో మనం కాకతీయ రాజులను ఏవిధంగా అయితే గుర్తుకు చేసుకుంటున్నామో అదే విధంగా ఈ ముఖ్యమంత్రి గారిని, మిషన్ కాకతీయ పథకానికి సంబంధించిన మంత్రి వర్యులను కూడా ప్రజలు ఎప్పటికి కూడా మరిచిపోరని మనవి చేస్తున్నాను. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో "ఇండస్ట్రియల్ కారిడార్" అభివృద్ధి చేయాలని, నూతనంగా ఏర్పడిన రాష్ట్రంలోకి పెట్టుబడి దారులు పెట్టుబడులు పెట్టడానికి సంకోచిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి గారు, ఐటి శాఖ మంత్రి గారు పెట్టుబడిదారులకు హైదరాబాద్ రంగారెడ్డి పరిసర ప్రాంతాలు ఇండస్ట్రీస్‌కు అనుకూలమైనవని, అక్కడ ఉన్నటువంటి పరిస్థితులను, ఐటి హబ్‌లను వారికి చూపించడం జరిగింది. ఇండస్ట్రీస్‌కు సంబంధించిన అనుమతుల కోసం "సింగల్ విండో పాలసీ" తీసుకురావడం జరిగింది. పెట్టుబడులతో తెలంగాణ రాష్ట్రానికి వచ్చి మీ ఇండస్ట్రీస్‌ను అభివృద్ధి చేసుకొని తెలంగాణను అభివృద్ధి చేయాలని వివిధ దేశాలకు చెందిన పెట్టుబడిదారులను తెలంగాణకు తీసుకురావడం జరిగింది. "ఐటి హబ్" ను మాత్రమే కాకుండా అనేక రకాల ఇండ్రస్ట్రీస్‌ను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మన ముఖ్యమంత్రి గారు పని చేస్తున్నారు. తెలంగాణలో ఫిల్మ్ ఇండస్ట్రీని డెవలప్‌మెంట్ చేయాలనే ఉద్దేశంతో ఫిల్మ్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్‌కు కూడా శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి గారికి, గవర్నర్ గారికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నాను. బాలివుడ్ సూపర్ స్టార్ అమితాబచ్చన్ నుండి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్నటువంటి సూపర్ స్టార్ కృష్ణ గారు కూడా ఈ ముఖ్యమంత్రిగారిని మెచ్చుకొని నిజమైన స్టార్ మన "కేసీఆర్" గారని చెప్పిన ఘనత కూడా మనకే దక్కిందని చెబుతున్నాను. తెలంగాణ రాష్ట్రం ఫార్మా ఇండస్ట్రీస్‌కు కూడా అనుకూలమైన వాతావరణ పరిస్థితులను కలిగి ఉంది. ఫార్మా ఇండస్ట్రీస్, ఔషధ మొక్కలను కూడా పెంచాలని ముఖ్యమంత్రి పర్యటనలు చేసి ఒక ఫార్మా హబ్‌ను ఏర్పాటు కోసం శ్రీకారం కూడా చేశారు. ప్రపంచంలో ఉన్నటువంటి వివిధ దేశాలు మన రాష్ట్రంలో ఫార్మా ఇండస్ట్రీస్‌ను ఏర్పాటు చేయడం కొరకు ముందుకు వస్తున్నాయి. చాలా అపోహలతో, చాలా అనుమానాలతో ఏర్పడ్డ ఈ నూతన తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టను పెంచాల్సిన బాధ్యత ఈ సభకు ఉన్నది. 9 మాసాల్లో గౌరవ ముఖ్యమంత్రి గారు చేసిన పనులు ట్రాన్స్‌పరెంట్‌గా జరుగుతున్నాయి, స్పష్టంగ కళ్లకు కట్టినట్లు కనబడుతున్నప్పటికి ఏదో జరిగిపోయిందని, మొత్తం ఆగమాగమయ్యిందన్నట్లుగా ఇంతకుముందున్న అధికార పార్టీ వాళ్లు, సీనియర్ పెద్దలు ఇబ్బందికర పరిస్థితులను కలిగిస్తున్నందుకు కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేను అయినప్పటికి నాకు చాలా భాద కలుగుతుంది. ఈ నిండు సభను హుందాగా చూపించుకున్నట్లయితే, ఒక పద్ధతి, సంస్కారం ప్రకారం సభను నిర్వహించుకుంటున్నారని తెలుస్తుంది. ఈ రాష్ట్రానికే ఇప్పటికే ఒక మంచి పేరు వచ్చింది, ఈ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పెట్టుబడి దారులు ముందుకు వస్తున్నారు, ఈ రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయల మీద మంచి నమ్మకంతో ఉన్నారు. మన సంస్కృతిలో భాగమైన "బ్రతుకమ్మ, బోనాల" పండుగలను ప్రపంచానికి చాటి చెబుతున్నాము. ఈ విధమైన మంచి వాతావారణాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రిగారిని అభినందించకుండా అనవసరమైన మాటలతో, అనవసరమైన ఇబ్బందులు చేస్తున్నారనే బాధ కలుగుతుంది. అదే విధంగా హైదరాబాద్ నానా జాతులకు, కులాలకు, సాంప్రదాయాలకు కేంద్రం. వారందరికి భరోస, భద్రత కల్పించాలనే ఉద్దేశంతో, శాంతి భద్రతలను పకడ్బందీగా నిర్వహించాలనే ధృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి గారు పదవి బాధ్యతలను చేపట్టగానే హైదరాబాద్ నగరాన్ని సెక్యూరిటి నగరంగా, ప్రశాంత నగరంగా చేయడానికి శాంతి భద్రతలను, పోలీస్ వ్యవస్థను ఏ విధంగా పటిష్టపరిచారనే విషయం మనందరికి కూడా తెలుసు. గత సంవత్సర నేరాలను, ఈ సంవత్సరం జరిగిన నేరాలను బేరీజు వేసుకొని చూస్తే మన ప్రభుత్వం ఎంత పకడ్బందీగా శాంతి భద్రతలను పటిష్ట పరిచిందనే విషయం మనకు తెలుస్తుంది. అర్ధరాత్రి ఆడవారు ఒంటరిగా తిరిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లుగా మహాత్మ గాంధీ గారు తెలిపిన విధంగా ఈ రోజు ఈ ముఖ్యమంత్రి గారు ఏ రాత్రైన ఆడవాళ్లు ఒంటరిగా తిరిగినా ఏ ఇబ్బంది కలుగకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక పోలీస్ టీమ్‌లను, "షీ టీమ్" లను ఏర్పాటు చేసి మహిళలకు ఆత్మ గౌరవాన్ని పెంచారు. ఆ విధంగా వివిధ కార్యక్రమాలను చేసినప్పటికి ముఖ్యమంత్రి ఇంకా ఏమి చేయాలో నాకు తెలువడం లేదు. ఈ కొత్తగా ఏర్పడిన రాష్ట్రాన్ని కులాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్లాల్సిన భాధ్యత మనందరిపై ఉన్నది. ఈ రాష్ట్ర అభివృద్ధికి, ఈ రాష్ట్రంలోకి వచ్చే పెట్టుబడిదారులకు నమ్మకం కలిగించడానికి

ముఖ్యమంత్రి గారు అహర్నిశలు పని చేస్తున్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న సంపదను కొల్లగొట్టడం కానీ, వనరులను దుర్వినియోగపర్చడం కూడా ఎక్కడా జరగలేదు. ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ముఖ్యమంత్రి గారు "నా కొడుకైనా, బిడ్డైనా అవినీతి చేస్తే సహించను" అని చెప్పారు. వారి పాలన కూడా అదే విధంగా కొనసాగుతుందని మీ అందరికి సభాపూర్వకంగా మనవి చేస్తున్నాను. మొదటి శాసనసభ సమావేశంలో కొంత మంది సభ్యులు కరెంట్ విషయంలో చాలా ఆగమాగం చేశారు. మీరు కరెంటును తెచ్చుకోలేకపోతే మాకు అవకాశమిస్తే ప్రక్క రాష్ట్రం నుండి కరెంట్‌ను తెస్తామని అన్నారు. ఆ సభ్యులకు కూడా గత పాలకులే ఈ కరెంటు కష్టాలకు కారకులని తెలుసు. ఈ ప్రాంతంలో గోదావరి జలాలు, బొగ్గు గనులు, ఖనిజ సంపద ఉన్నప్పటికీ, ఈ ప్రాంతంలో ఇండస్ట్రీస్‌ను పెట్టలేదు, పవర్ ప్రాజెక్టులను నిర్మించలేదు. కానీ, వేరే ప్రాంతంలో ఎక్కడో పెట్టామని కూడా వారికి కూడా తెలుసు. కానీ, ప్రభుత్వాన్ని, పాలనను అభాసుపాలు చేయాలని, ఒక చేతకాని ప్రభుత్వంగా చూపించాలనే ఉద్దేశంగా నానా పరిస్థితి చేశారు. ఆ పరిస్థితి ఇంకా కొనసాగుతూనే ఉంది. తన తప్పుని ఒప్పుకొని పవర్ మీద మాట్లాడిన విషయాలను కూడా ఇప్పటివరకు ఈ సభకు తీసుకరాలేదు. ముఖ్యమంత్రి ఒక మాటను మాట్లాడారంటే ఆ మాటకు వెనుకకు పోయే వ్యక్తి కాదు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏవిధంగా తీసుకువస్తానని చెప్పారో అదే విధంగా కరెంటు కష్టాలు కూడా లేకుండా, వచ్చే మూడు సంవత్సరాల్లో కనురెప్ప పాటు కూడా కరెంటు పోకుండా చేస్తానని మొన్న శాసనసభలో, బయట సమావేశాలల్లో కూడా చెప్పడం జరిగింది. అదే విధంగా ఉండాలనే ఆలోచన చేస్తున్నారు. ఖచ్చితంగా ఆ విధంగా ఉంటుంది కూడా. చీకట్లో ఉన్న తెలంగాణలో వెలుగులు విరజిమ్మాలనే గొప్ప దూరదృష్టితో తెలంగాణలో పవర్ ప్లాంట్‌లకు, పవర్ ప్రాజెక్టులకు శ్రీకారం చూడుతున్నారు. రాష్ట్రంలో కరెంటు కష్టాలున్నప్పటికీ, ప్రక్క రాష్ట్రం నుంచి కరెంటు కొనుగోలు చేసి నాణ్యమైన విద్యుత్‌ను రైతులకు 6 గంటల పాటు, పరిశ్రమలకు 24 గంటలపాటు నిరంతరాయంగా ఇవ్వడానికి ఇప్పటికే ఈ ప్రభుత్వం చర్యలు తీసుకున్నందుకు నేను ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నాను. గత ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం వల్ల అడవులు హరించిపోయి సరైన వర్షాలు పడకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్రం నీటి ఎద్దడితో విలవిలలాడుతోంది. పోయిన వర్షాలు మరల రావాలని, తెలంగాణ పల్లెల్లో పంటలు పచ్చగా కళకళలాడాలనే ఉద్దేశంతో ఈ "హరిత హారం" పథకాన్ని తీసుకురావడం గొప్ప కార్యక్రమముగా మీ అందరికి సభాపూర్వకంగా తెలియజేస్తూ ఈ పథకాన్ని తీసుకవచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదములు తెలియజేస్తున్నాను. ప్రతి నియోజకవర్గం వారీగా, మండలాల వారీగా, గ్రామాల వారీగా ఒక లక్ష్యాన్ని నిర్దేశించి ఆ లక్ష్యాన్ని ఛేదించి తెలంగాణ రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చడానికి చర్యలు తీసుకుంటున్నందుకు నేను ఈ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నాను. శాసనసభ సభ్యులు శాసనసభలో తమ నియోజకవర్గాల్లో ఉన్నటువంటి ప్రజా సమస్యల, రాష్ట్రంలో ఉన్నటువంటి సమస్యల గురించి చర్చించి, పరిష్కారం తీసుకుంటారని అనుకున్నాను. కానీ, చాలా మంది సభ్యులు శాసనసభలో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే విధంగా చేయడాన్ని సభలో, సభావరణలో ఉన్న ప్రజలు గమనిస్తున్నారు. మనకు ఉన్నటువంటి విలువైన సమయాన్ని ఈ రాష్ట్రాభివృద్ధి కొరకు, నియోజక వర్గ, ప్రజ సమస్యలపై చర్చించుకునే విధంగా ఉండటానికి మనందరం సహకరించుకోవాలని మనవి చేస్తున్నాను. గవర్నర్ గారి ప్రసంగానికి ధన్యవాదములు తెలియజేసే అవకాశమిచ్చినందుకు మీకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నాను.

1.30 మ. ప్రప్రథమంగా నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఆలయాలను ధూపదీప నైవేద్యాలకు ఎలాంటి కొరత లేకుండా చూడాలని తెలంగాణా రాష్ట్రంలో నిర్ణయం తీసుకోవడం జరిగింది. యాదగిరి లక్ష్మీ నర్సింహ స్వామి గుడికి బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించి తెలంగాణ రాష్ట్రంలోనే ఒక గొప్ప దేవాలయంగా తీర్చి దిద్దబోతున్నారు. నా నియోజక వర్గంలో ఐనవోలు మల్లిఖార్జున స్వామికి ప్రప్రథమంగా పట్టు వస్త్రాలు పంపిన చరిత్ర తెలంగాణ రాష్ట్రానికే దక్కింది. గతంలో చిన్న చిన్న గుళ్లు చాలా వెనుకబడిపోయాయి. అన్ని గుళ్లకు ధూపదీప నైవేద్యాలు అందించాలనే ఒక మంచి సంకల్పంతో కేసిఆర్‌గారు ముందుకు పోతున్నందుకు ముఖ్యమంత్రిగారికి ధన్యవాదాలు తెలియ చేస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చిన స్పీకర్‌గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

శ్రీమతి జి. సునీత (ఆలేరు): అధ్యక్షా, మూడవ శాసనసభ సమావేశాలలో పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలో గవర్నర్‌గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో మాట్లాడడానికి నాకు అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు తెలియ చేస్తున్నాను. శ్రీ యాదగిరి లక్ష్మీ నర్సింహ స్వామి ఆశీస్సులతో, గౌరవ ముఖ్యమంత్రి కేసిఆర్‌గారి ప్రోత్సాహంతో శాసనసభలో ఈ రోజు మాట్లాడగలుగుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వం యొక్క పాలన గవర్నర్‌గారి ప్రసంగంలో తెలంగాణప్రభుత్వ లక్ష్యాలను, ఉద్దేశ్యాలను చాలా చక్కగా పొందుపరిచారు. చాలా సంతోషంగా ఉంది.

ఈ రోజు మన భారత దేశానికి రాజ్యాంగం అతి పెద్ద గ్రంథం. ఈ రాజ్యాంగంలోని మొదటి ప్రవేశికలో భారతదేశం యొక్క ఆత్మ వెల్లడి అయింది. అదే విధంగా ఈ రోజు ప్రభుత్వంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ గతంలో ఎన్నికలకు ముందు మ్యానిఫెస్టోలో ప్రవేశపెట్టిన దానిని ఒక భగవద్గీతలాగా భావిస్తూ ఆ అంశాలను నెరవేర్చడానికి ప్రభుత్వం ముందుకు వెళుతుంది. డా. బి. ఆర్. అంబేద్కర్‌గారు మన రాజ్యాంగ సృష్టికర్త. ఆయన బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయాలని కోరుకున్నారు. అదే విధంగా ఈ రాష్ట్రం ముందుకు వెళ్లడాన్ని గర్విస్తున్నాను. స్వాతంత్ర్యం వచ్చి 67 సంవత్సరాలు నిండినా, గడిచిన కాలంలో ప్రభుత్వ పాలన చేసిన అనేక పార్టీలు గొప్పలు చెప్పాయి. దళితుల సంక్షేమం కోసం గిరిజనుల సంక్షేమం కోసం ప్రగల్బాలు పలికిన సంధర్భాలెన్నో చూశాము. గత ప్రభుత్వాలు మాటల వరకే పరిమితం అయ్యాయి. ఈ రోజు ప్రజలలో నుండి వచ్చిన మా నాయకుడు ప్రజలను ఉద్యమం వైపు మళ్లించి రాష్ట్ర సాధనకోసం అహర్నిశలు కృషి చేసిన ముఖ్యమంత్రి కేసిఆర్‌గారు ప్రభుత్వంలోకి వచ్చి రాగానే మొట్టమొదటిసారిగా దళితులకు ఎంత గొప్పగా కార్య క్రమాలు చేపట్టారో సభాసదులందరికీ విదితమే. సంక్షేమ పథకాల విషయంలో దళితులకు వ్యవసాయ యోగ్యమైన మూడెకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టాలు కూడా మా మహిళలకే ఇచ్చారు. ఆ విషయం చాలా సంతోషాన్నిచ్చింది. గత ప్రభుత్వాలు దళిత కుటుంబాలకు దళిత వర్గాలకు కేటాయించిన నిధులను మళ్లించి ఇతర అంశాలకు ఖర్చు పెట్టడం జరిగింది. ఆ విధంగా ఫండ్సును మళ్లించడం జరిగింది. హైదరాబాదులోని ఔటర్ రింగ్ రోడ్డును దళితుల నిధులతోనే నిర్మించడం జరిగింది. దళితులకు కేటాయించిన నిధులను సక్రమంగా వాడుకోని ప్రభుత్వాలను గతంలో చూశాము. ఈ ప్రభుత్వం నూటికి నూరుపాళ్లు ఖచ్చితంగా ఒక్క రూపాయి కూడా దారి మళ్లకుండా దళితులకే ఖర్చు పెట్టాలని ఆకాంక్షతో ముందుకు పోతుంది. ఈ విధంగా గౌరవ సభ్యులు ఎస్‌సిల వర్గీకరణ విషయంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఇంకా ఇప్పటి వరకు ఒక పార్టీ ఇంకో రాష్ట్రంలో అధికారంలో ఉన్నా కాని ఆ పార్టీ అలాంటి నిర్ణయాలు తీసుకోలేదు. ఆ విషయంలో మేము చాలా గొప్పగా ఫీల్ అవుతున్నాము. చెప్పిన మాటకు కట్టుబడి ఈ ప్రభుత్వం ముందుకు పోతుంది.

గిరిజనులకు సంబంధించి కూడా వారికిచ్చిన మాట ప్రకారం ఈ రోజు వారికి పన్నెండు శాతం జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పిస్తామని, దానికి సంబంధించి చెల్లప్ప గారి కమీషన్‌ను వేయడం జరిగింది. ఆ కమీషన్ రిపోర్టులో ఏముందో వాటిని మేము పాటిస్తామని గొప్పగా ప్రభుత్వం చెప్పింది. గిరిజనులందరికీ రిజర్వేషన్ కల్పించడంలో ముందుంటామని కేవలం ఒక లోకల్ బాడీ ఎలక్షన్సులోనే కాకుండా రేపు నామినేటెడ్ పదవులలో కూడా గిరిజన సోదరులకు రిజర్వేషన్ కల్పిస్తామని ఈ ప్రభుత్వం చెప్పింది. కొండలలో కోనలలో ఎక్కడో విసిరేసినట్టున్న గిరిజనులందరికీ తప్పకుండా న్యాయం చేయాలని మన ముఖ్యమంత్రిగారు వారి ఆవాసాలను అంటే తండాలను గ్రామ పంచాయితీలుగా గుర్తించి , వారికి న్యాయం చేయాలనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రిగారు ముందుకు వెళుతున్నారు. వాల్మీకి బోయలను, కాయతి లంబాడాలను ఎస్‌టిలుగా గుర్తించి వారికి కూడా న్యాయం చేయాలని ప్రభుత్వం ముందుకు వెళుతుంది. లంబాడీలు ఆడ పిల్లలను అమ్ముకున్న సందర్భాలను ఎన్నో చూశాము. ఆడపిల్ల పుడితే అమ్ముకున్న సందర్భాలను ఎన్నో చూశాము. ఇవన్నీ ఉద్యమ నేతగా చూసిన మన ముఖ్యమంత్రిగారు కేసిఆర్‌గారు ఆడపిల్లను ఆదుకోవాలని వారికి కూడా మంచి విద్యాబుద్దులు చెప్పించాలని ఒక గొప్ప సంకల్పంతో ముందుకు వెళుతున్నారు. అలాగే కల్యాణ లక్ష్మి పథకం ద్వారా గిరిజన ఆడపిల్లలకు తప్పకుండా వారికి ఒక మేనమామలాగ లాంఛనాలు జరిపే క్రమంలో మేనమామలాగ నేను కూడా సాయపడతానని, తాను ఆ అమ్మాయికి పెండ్లి చేస్తానని రూ.51వేల రూపాయలను కేటాయించడం జరిగింది. వారికిచ్చే డబ్బులను రూ.50వేలు ఉన్న దానిని రూ.51వేలుగా కేసిఆర్‌గారు మార్చడం జరిగింది. ఏ విషయంలో అయినా మన సాంప్రదాయాలను ఎక్కడా మరచిపోకుండా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకుపోతున్నారు.

బలహీన వర్గాలకు ఈ రోజు కేవలం స్థానిక సంస్థలలోనే వారికి రిజర్వేషన్సు అమలవుతున్నాయి. కాని మన ప్రభుత్వం రేపు అసెంబ్లీలో కూడా వారికి రిజర్వేషన్ కల్పించాలనే ఉద్దేశ్యము, నమ్మకంతో ముందుకు వెళుతుంది. ఈ ప్రభుత్వానికి నామినేటెడ్ పోస్టులలో బిసి వర్గాల వారికి దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలనే ఆలోచనతో ముందుకు వెళుతుంది. ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజల మన్ననలను పొందుతున్న విషయం గవర్నర్‌గారి ప్రసంగంలో స్పష్టంగా చెప్పారు. గతంలో పేరుకు మాత్రమే కొన్ని అంశాలను తీసుకొని వాటినే గొప్పగా చిత్రీకరించుకున్నారు. అంగన్‌వాడీ సెంటర్సు ద్వారా ఆ రోజు గర్భిణీలకు ఏ విధంగా భోజనం పెట్టారో చూశాము. నెలలో ఒక పదహారు గుడ్లు ఇస్తే సరిపోతుందని అనుకున్నారు. పిండం కడుపులో పడ్డ తరువాత పుట్టి పెరిగి పెద్దదై బయటకు వచ్చిన బిడ్డకు ఆరు సంవత్సరాల వచ్చే వరకు నేనే బాధ్యత తీసుకుంటానని పూర్తిగా సంపూర్ణ

భోజనాన్ని అందించాలని ఒక గొప్ప కార్యక్రమం మన ముఖ్యమంత్రిగారు చేపట్టారు. ఆ కార్యక్రమాన్ని ఆరోగ్య లక్ష్మి ద్వారా సంపూర్ణ భోజనాన్ని అందిస్తున్నాము. గతంలో గర్భిణీ స్త్రీలకు ఎలా పెట్టారో నాకు కూడా తెలుసు. నేను కూడా సర్పంచ్‌గా, ఎమ్‌పిటిసిగా పని చేశాను. పాలు, ఒక గుడ్డు, కొన్ని బియ్యం, పప్పు వారి చేతికిచ్చి ఇంటికి పంపేవారు కాని ఇంటికి అల్లుడు రాగానే అదే గుడ్డుతో ఆమ్లెట్ వేయాలె అదే అల్లుడికి పెట్టాలి. ఆ విధంగా మర్యాద చేసేవారు. కాని మా ముఖ్యమంత్రిగారు మాత్రం నా బిడ్డకు పరిపూర్ణంగా భోజనం పెట్టాలని, అంగన్‌వాడీ సెంటర్సులో వండి వార్చాలని, పనికి పోతున్న వారికి వీలు కావడం లేదంటే, అటువంటి మహిళలకు, ఇబ్బంది పడే వారికి అవసరం అనుకుంటే ఉ.9.00 గంటలకే సంపూర్ణ భోజనం అందించే విధంగా ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి రోజు కోడి గుడ్డును, 200 ఎమ్.ఎల్. పాలు మంచి పౌష్టికాలను ఇచ్చే విధంగా ఈ ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. గతంలో అంగన్ వాడీ సెంటర్సుకు ఆదివారాలుంటే సెలవుండేది. ఇప్పుడు సెలవున్నా సరే ఆ రోజు పాలను, గుడ్డును సోమవారం, బుధవారాలలో ఆ పాలను తోడు వేసి పెరుగును అందించే విధంగా, ఆ రోజు కోడిగుడ్డును బుధవారం నాడు ఒక పండు రూపకంగా లేక ఇంకో రూపకంగా కేటాయించే విధంగా ఈ ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. గర్భిణీ స్త్రీ, పుట్టిన బిడ్డ ఆరు సంవత్సరాల వరకు, అదే విధంగా బాలింతలకు ఆరోగ్యంగా ఉంటేనే మంచి పోషక విలువలున్న ఆహారాన్ని పాలను ఆ బిడ్డకు అందిస్తుందనే ఉద్దేశ్యముతో బాలింతలకు కూడా ఈ కార్యక్రమాన్ని వర్తింప చేస్తున్నాము. ఈ విధంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

1.45 మ. ఆ విధంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఆసరా పథకం ద్వారా ఎంత మంది లబ్ధిపొందుతున్నారో మనకు తెలుసు. ఇంతకు ముందు గౌరవ శాసనసభ్యులు ఆరూరి రమేష్‌గారు చెప్పడం జరిగింది. వికలాంగులకు గతంలో రూ. 500 / పెన్షన్ ఇచ్చేవారు. ఇప్పుడు 41 శాతం అంగవైకల్యం ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.1500/ పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దారం వడికి, వడికీ నరాలు బలహీనపడిపోయిన మా నేతన్నలకు వెయ్యి రూపాయల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం జరిగింది. కల్లు గీత కార్మికులు, చెట్లు ఎక్కీ, దిగి కీళ్ల అరిగిపోయి, యాభై సంవత్సరాల తరువాత చేతకాని వారిగా మిగిలిపోతున్నారు. వారికి కూడా వెయ్యి రూపాయల పెన్షన్‌ని అందిస్తున్నారు. పేద ప్రజలకు గతంలో తెల్ల రేషన్ కార్డులుండేవి. ఈ ప్రభుత్వం ఆహార భద్రతా కార్డులు అందించి, ఆహార భద్రతను పేద ప్రజలకు కల్పిస్తుంది. ఆహార భద్రత ద్వారా ప్రతి పేదవాడికి ఆరు కిలోల బియ్యం చొప్పున సరఫరా చేయడం విశేషం. ఆనాడు ఒక కుటుంబంలో ఇరవై కేజీల బియ్యం కంటే ఎక్కువ ఇవ్వకూడదని నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ ప్రభుత్వం, కుటుంబంలో 8 మంది ఉన్నా సరే, 8x6 చొప్పున లెక్కపెట్టి 48 కేజీల బియ్యాన్ని సరఫరా చేయడం జరుగుతుంది. ఇంటికి చుట్టం వస్తే, సగం చెంబుతో నీళ్లు ఇవ్వకూడదు, చెంబు నిండా నీళ్లు ఇవ్వాలని గొప్ప సంకల్పం ఉన్న వ్యక్తిగా కేసీఆర్ గారు ఆహార భద్రత చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఆహార భద్రతా కార్డుల ద్వారా రూపాయికి కేజీ బియ్యాన్ని అందించడం జరుగుతుంది. విభిన్న సంస్కృతులకు, విభిన్న మతాలకు నిలయం ఈ రాష్ట్రం. రాష్ట్రంలోని మైనారిటీలకు, సంక్షేమ పథకాలను అందించాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోంది. కొన్ని వందల సంవత్సరాల క్రితం ఇతర రాష్ట్రాల నుండి వచ్చి ఇక్కడ స్థిరపడిన సిక్కు సోదరులకు న్యాయం చేయడానికి, గురుద్వారాలు నిర్మించుకోడానికి మూడు ఎకరాల భూమిని కేటాయించడం జరిగింది. మైనారిటీ వర్గాల వారికి షాదీ ముబారక్ పథకం ద్వారా యాభై ఒక్క వేల రూపాయలను పెళ్లి ఖర్చుల క్రింద అందించాలని ఈ ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. దళిత, గిరిజన కుటుంబాలలో పుట్టిన అమ్మాయిలకు కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా చేయూతనివ్వడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. లోగడ పోకడ ఏ విధంగా ఉంది, ఈ ప్రభుత్వ పోకడ ఏ విధంగా ఉందో ఎవరికి వారు తర్కించుకుంటే బాగుంటుంది.

ఇక గృహ నిర్మాణ పథకం అధ్యక్షా. గత ప్రభుత్వంలో ఏ విధంగా జరిగిందో చెప్పుకోవాలంటే చాలా సిగ్గుగా ఉంది. గతంలో నాలుగు లక్షల ఇళ్లు మంజూరు చేస్తే, లక్ష ఇళ్లు కట్టకుండానే బిల్లులిచ్చిన దాఖలాలు ఈరోజు బయట పడ్డాయి. సిఐడీ ఎంక్వైరీ ద్వారా ఆ విషయం బయటపడింది. పేదల కోసం మంజూరు చేసిన ఇళ్లకు సంబంధించిన బిల్లులు ఒక పార్టీ కార్యకర్త కాజేసాడని స్పష్టంగా సిఐడి నివేదిక చెబుతుంది. నిజంగా సిగ్గుపడాలి. ప్రజల చేత ఎన్నుకోబడిన మనం, ప్రజలకు జవాబు చెప్పవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. హాస్టల్స్‌లో చదివే పేద విద్యార్థులకు మంచి భోజనాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో సన్న బియ్యంతో భోజనం పెట్టడం జరుగుతోంది. హాస్టల్స్‌లో చదువుతున్న పిల్లల పరిస్థితి ఏవిధంగా ఉందో ఆరూరి రమేష్ గారు చెప్పారు. నేను కూడా హాస్టల్‌లో చదువుకున్నాను, పురుగుల అన్నం తిన్నాను, దొడ్డు బియ్యం అన్నం

తిన్నాను అని వారు చెప్పారు. సన్న బియ్యమే కాదు, పప్పుదినుసులకు, సబ్బులకు గత ప్రభుత్వం పద్నాలుగు రూపాయలిస్తే, ఈ ప్రభుత్వం ఒకొక్క విద్యార్థికి, రోజుకు రూ. 28 కేటాయించడం జరుగుతోంది. ఆ విధంగా కేటాయించి ఆ బిడ్డలను సొంత బిడ్డలుగా ఈ ప్రభుత్వం చూసుకుంటుందని మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన అమరవీరుల గురించి మీకు తెలుసు. అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలనే మహాలక్ష్యంతో గత సభలో అందరం మాట్లాడుకున్నాము, తీర్మానం చేసుకున్నాము. అదే విధంగా ఆ కుటుంబాలకు పది లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా అందించడమే కాకుండా, ఆ కుటుంబంలో చదువుకున్న వారికి ప్రభుత్వోద్యోగం ఇవ్వాలనే గొప్ప సంకల్పంతో ఈ ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. ఎంతచేసినా ఆ కుటుంబాలకు సరిపోదు, ఎంతోకొంత ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక తెలంగాణ కోసం, పోరాటంలో పాల్గొన్న ఉద్యోగ సోదరులకు మంచి ప్రోత్సాహం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర ఇంక్రిమెంట్‌ని ఇప్పించడమే కాకుండా, 43 శాతం ఫిట్‌మెంట్‌ను ఇవ్వడం జరిగింది. గత ప్రభుత్వం 39 శాతం ఫిట్‌మెంట్‌ను ఇచ్చింది. దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా 43 శాతం ఫిట్‌మెంట్‌ను ఈ ప్రభుత్వం ఇచ్చింది. గతంలో ఎవరూ ఈ విధంగా ఇచ్చిన దాఖలాలు లేవు. ఇది ఒక రికార్డ్. నిజంగా చాలా సంతోషం. ముఖ్యమంత్రి గారు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత వ్యక్తులతో చర్చించి నిర్ణయం తీసుకుంటారు. అదే విధంగా ఉద్యోగస్తులను పిలిపించి, వారి సాధకబాధకాలు విని, వారు కోరిన కోరికలకు అనుగుణంగా కేసీఆర్ గారు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రత్యేక తెలంగాణ ఇంక్రిమెంట్‌తోబాటు, హెల్త్‌కార్డులను మంజూరు చేసి, స్నేహపూర్వక ప్రభుత్వాన్ని నెలకొల్పాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. అంగన్‌వాడీ సోదరీమణులు సీయం గారితో వచ్చి రెండున్నర గంటల సేపు మాట్లాడారు. వారు బాధలు ఓపికగా విని తప్పకుండా వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జీతభత్యాలే కాదు, హెల్త్ ఇన్సూరెన్స్ కల్పిస్తామని చెప్పారు. అందుకు ఒక ఆడబిడ్డగా నేను సంతోషిస్తున్నాను. పాత్రికేయ సోదరులకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశ్యంతో, వారితో చర్చించి వారికి అక్రిడేషన్ కార్డులను ఇవ్వడమే కాకుండా, పాత్రికేయుల వెల్ఫేర్ ఫండ్‌ను ఈ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 201415 సంవత్సరానికి సంబంధించి పది కోట్ల రూపాయలను సంక్షేమ నిధికి కేటాయించడమే కాకుండా, ఈ అయిదు సంవత్సరాలలో వంద కోట్ల రూపాయలను వారి సంక్షేమ నిధికి కేటాయించి, వారి కుటుంబాలకు మేలు చేయాలని నిర్ణయించడం జరిగింది. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో అల్లం నారాయణ గారు చేసిన కృషి మీకు తెలుసు. వారికి ఈ బాధ్యతను అప్పజెప్పి, పాత్రికేయ సోదరులకు న్యాయం చేసే విధంగా నిర్ణయం తీసుకోవడం జరిగింది. న్యాయవాదులను కూడా పిలిపించుకున్నారు. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో న్యాయవాదుల పాత్ర మరచిపోలేనిది. ఆరోజు న్యాయవాదులు ఢిల్లీకి వెళ్లి అక్కడ కూడా పోరాటం చేశారు. అందుకని న్యాయవాదుల కోసం, వారి సంక్షేమ కోసం వంద కోట్ల రూపాయల నిధులను కేటాయించాలని ఈ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నిరుద్యోగులు అనేక మంది ఆటోరిక్షాలు, ట్రాక్టర్లు నడిపిస్తూ జీవితం కొనసాగిస్తున్నారు. వారికి సహాయపడాలనే ఉద్దేశ్యంతో వారికి ట్యాక్స్ ఎగ్జంప్షన్ ఇవ్వడం జరిగింది. ఆటోలకు, ట్రాక్టర్లకు, ట్రాలీలకు ట్యాక్స్ ఎగ్జెంప్షన్‌ను ఇవ్వడం జరిగింది. వ్యవసాయ రంగం చాలా ముఖ్యమైనది. రాష్ట్రంలో వ్యవసాయం లేకుండా చేసిన ఘనత ఎవరిదో మీకు తెలుసు. కేసీఆర్ గారు రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో, ప్రభుత్వంలోకి వచ్చిరాగానే, లక్ష రూపాయల రుణమాఫీని చేయడమే కాకుండా, వ్యవసాయ పనిముట్లకు సబ్సిడీ ఇవ్వాలనే ఉద్దేశ్యంతో రైతన్నల ట్రాక్టర్లకు సబ్సిడీని అందించడమే కాకుండా హార్వెస్టింగ్ మెషీన్లకు సబ్సిడీ అందిస్తున్నారు.

2.00 మ.

గతంలో వచ్చినటువంటి భారీ వర్షాల వల్ల, వడగండ్ల వానల వల్ల, నీలం తుఫాను వల్ల నష్టపోయిన రైతన్నలకు ఈ ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీలు ఇచ్చి ఆదుకోవడం జరిగిందన్న విషయం మీ అందరికి కూడా తెలుసు. "ఎద్దేడ్చిన వ్యవసాయం - రైతేడ్చిన రాజ్యం బాగుపడదని", రైతులకు తప్పకుండా న్యాయం చేయాలని, గతంలో ఉద్యమ నేతగా ఉన్న మన ముఖ్యమంత్రి గారు గత ప్రభుత్వాలకు ఎన్నో సార్లు విజ్ఞప్తి చేసిన, పోరాటాలు చేసిన గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. కానీ, ఈ రోజు ఈ ప్రభుత్వం రైతన్నలు వ్యవసాయం చేసుకోవడానికి పూర్తిగా సహకారం అందిస్తున్నది. కొన్ని ప్రాంతాల్లో కరువు ఏర్పడినందున కొద్ది మంది రైతులు ప్రత్యామ్నాయ పరిస్థితులను చూసుకుంటున్నారు. అదే విధంగా పాడి మీద ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు కూడా మేలు చేయాలనే ఉద్దేశంతో ఒక లీటరుకు 4 రూపాయల ప్రోత్సాహక ధరను కూడా పెంచడం జరిగింది. హార్టికల్చర్, "డ్వామా" ద్వారా పాలిహౌస్‌లు, తోటలను ఏర్పరుచుకుంటున్న రైతులకు కూడా ప్రభుత్వం గొప్పగా సబ్సిడీలు అందచేసి వారిని ఆదుకుంటుంది. నిన్న "ప్రపంచ మహిళా దినోత్సవం" జరుపుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ రోజు ఒక కుటుంబం బాగుండాలంటే అందులో మహిళల భాగస్వామ్యం చాలా

ఉంటుంది. గతంలో మహిళలను కేవలం అనుత్పాదక రంగంలో మాత్రమే ఉంచడం వల్ల మహిళలకు అంతగా గుర్తింపు లభించకపోయేది. కానీ, ఈ ప్రభుత్వం మహిళలకు కూడా ఉత్పాదక రంగంలో రిజర్వేషన్‌లను కల్పించి, వారిని ప్రోత్సహించాలనే దిశగా పని చేస్తుంది. కుటుంబం యొక్క తోడ్పాటులో మహిళ ఏవిధంగా తోడ్పడుతుందో, అదేవిధంగా సామాజిక అభివృద్ధికి కూడా మహిళ తోడ్పడుతుందని, తద్వార ఈ రాష్ట్రాభివృద్ధిలో మహిళ పాత్ర గొప్పదని చెప్పడానికి నేను చాలా సంతోషపడుతున్నాను. కానీ, ఇప్పటికి కూడా మహిళలపై వరకట్న వేధింపులు, యాసిడ్ దాడులు, గృహ హింస మొదలైనవి అక్కడక్కడ జరుగుతూనే ఉన్నాయి. "మహిళలు ఏడిస్తే దేవతలు ఏడ్చినట్లే, దేవతలు ఏడిస్తే ఈ రాష్ట్రం సుభిక్షంగా ఉండదని", రాష్ట్రంలో ఉన్న మహిళలందరిని కాపాడాలనే ఉద్దేశంతో, మన గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని మహిళల రక్షణ కోసం "షీ" టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగింది. హైదరాబాద్ నగరంలో ఇప్పటికి కూడా మహిళల పై యాసిడ్ దాడులు, ఈవ్ టీజింగ్ వంటి కార్యక్రమాలు ఎక్కువగా జరిగే పరిస్థితి ఉన్నందున ప్రతి కూడలిలో కూడా సి.సి. కెమెరాలను ఉపయోగించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు శాఖ అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకుంటుందని తెలియజేస్తున్నాను. చట్టసభల్లో మహిళలకు కూడా 33శాతం రిజర్వేషన్ ఉండాలని ఈ సభలో నిర్ణయం కూడా తీసుకోవడం జరిగింది. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి ఈ నిర్ణయం తప్పకుండా అమలయ్యేలా సహకరించాలని ఈ సభలో ఉన్న మిగతా పార్టీల గౌరవ శాసన సభ్యులను కోరుతున్నాను. మహిళ క్రీడాకారిణి అయిన సానియా మీర్జాను రాష్ట్ర అంబాసిడర్ గా నియమించి మహిళలను గొప్పగా గౌరవించే విధంగా మన ముఖ్యమంత్రి గారు చర్యలు చేపడుతున్నారని తెలియజేస్తున్నాను. తెలంగాణ ఉద్యమంలో ఎంతో మందిని ఉత్తేజపర్చి వారిని ఉద్యమంలోకి మళ్లించిన కళాకారులను కూడా గొప్పగా గౌరవించుకోవాలనే దిశలో వారికి కూడా గుర్తింపు కార్డులు ఇచ్చి, అవసరాన్ని బట్టివారికి ఉద్యోగాలు తప్పకుండా కల్పించాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం పని చేస్తుంది. అదే విధంగా వృద్ధకళాకారులకు కూడా పింఛన్ అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రభుత్వం పని చేస్తుంది. నా నియోజక వర్గంలో, నేను నివసిస్తున్న ప్రదేశంలో ఉన్నటువంటి యాదగిరి గుట్టలోని "శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయం" అభివృద్ధికి, ఆలయాన్ని గొప్ప పుణ్య క్షేత్రంగా మార్చడానికి ప్రభుత్వం గత బడ్జెట్‌లోనే రూ.100 కోట్లు కేటాయించడం జరిగింది. ఆగమ శాస్త్ర నిపుణులను, స్తపతులతో చర్చించి ఆలయాన్ని గొప్పగా తీర్చిదిద్దడం కోసం, ఆలయ వైభవాన్ని పెంచాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి గారు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఫలానా వాళ్లను తీసుకువచ్చి, ఫలాన రీతిలో చేస్తున్నారని, అతనొక యుగపురుషుడంటా? అని నిన్నెవరో కామెంట్ చేయడం నాకు చాలా బాధను కలిగించింది. అవును, నిజంగా అతనొక యుగపురుషుడే. ఈ రోజు ఎవరికి తెలిసిన తెలియకపోయిన యాదగిరిగుట్ట చరిత్రను చెప్పాలను కుంటున్నాను. పెద్ద జియర్ స్వామి వారు యాదగిరిగుట్ట పుణ్య క్షేత్రానికి 1962లో వచ్చినప్పుడు అక్కడ ఒక యంత్రాన్ని స్థాపిండం జరిగింది. ఆ యంత్రం స్థాపించిన తరువాతనే యాదగిరిగుట్ట పుణ్య క్షేత్రానికి అంతటి వైభవం వచ్చింది. అంతకు ముందు ప్రభుత్వాలు యాదగిరిగుట్టకు అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు. 1962 నుంచే యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి గొప్ప వైభవం వచ్చింది. ఈ రాష్ట్రంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నటువంటి వేద పండింతులందరికి కూడా అక్షరాభ్యాసం ఇక్కడే జరిగిందని చెప్పడానికి నేను గర్వపడుతున్నాను. పెద్ద జియర్ స్వామిగారు యాదగిరి గుట్ట పుణ్య క్షేత్రంలో మొట్ట మొదటిసారిగా వేద పాఠశాలను స్థాపించి, జ్ఞానబోధను కూడా అక్కడి నుండే చేయడం జరిగింది. ఈ రోజు ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలంటే దైవానుగ్రహం కూడా ఉండాలని, ఆ పుణ్య క్షేత్రాన్ని గొప్పగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మన ముఖ్యమంత్రిగారు పనిచేస్తున్నారు. నిబంధనలు కూడా ప్రక్కకు పెట్టి, అనేక మతాలకు ఆలవాలమైన ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని మతాల వారిని గౌరవించాలని ప్రార్థన మందిరాలైన చర్చ్, మసీదు, గురుద్వారాల మరమ్మత్తుల కొరకు, కొత్త భవనాల కొరకు నిధులను కేటాయించి మన కేసీఆర్ గారు అందరికి కూడా సమానత్వాన్ని చాటుతున్నారు. ప్రతి దేవాలయంలోను ధూప, దీప నైవేద్యాలకు నిధులను కేటాయించి ప్రతి నిత్యం దేవాలాయల్లో ఖచ్చితంగా పూజలు, ధూప, దీప నైవేద్యాలు జరిగేలా మన ముఖ్యమంత్రి గారు చర్యలు చేపడుతున్నారు. మన ప్రియతమ ముఖ్యమంత్రి "కేసీఆర్" గారు అన్ని మతాలను ఆదరించిన ఒక లౌకికవాదిగా, ఒక సెక్యులరిస్ట్ అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని చెబుతున్నాను. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రయత్నించే ఒక కమ్యూనిస్ట్ అని చెప్పడంలో కూడా అతిశయోక్తి ఏమీ లేదు. తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చడానికి ఒక ఆప్టిమిస్ట్‌గా పనిచేస్తున్నారని నేను తెలియజేస్తున్నాను. ఈ గొప్ప రాష్ట్రంలో శాసనసభ్యురాలిగా సేవలందిస్తు న్నందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. "కొలనులో ఉండే కలువ పూలు ఏవిధంగా అయితే చంద్రుడి వెన్నెలతో, ప్రకాశంతో విచ్చుకుంటాయో అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న యువత కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ గారి

ఆలోచనలతో, లక్ష్యాలతో కలువలు వలే విచ్చుకొని బంగారు తెలంగాణ నిర్మాణంలో అందరు కూడా ముందుంటారని ఆకాంక్షిస్తున్నాను". నాకు మాట్లాడే ఈ అవకాశమిచ్చినందుకు మీకు ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియజేస్తున్నాను.

శ్రీ ఆర్. రవీంద్ర కుమార్(దేవరకొండ): అధ్యక్షా, ఈ రోజు ఉదయం శాసనసభ ప్రారంభమైన సమయం నుంచి మాట్లాడే అవకాశం కోసం చేత్తులెత్తి అలిసిపోయాం, గతంలో వలె కాకుండా మా సీటింగ్ స్థానాలు మారిపోయి వెనుకవైపుకు వచ్చాము. మీరు అటు ఇటు చూస్తున్నారు. కానీ, సిపిఐ, సిపియం పార్టీ అభ్యర్థులను మాత్రం పట్టించుకోవడం లేదు. మేము సంఖ్యాపరంగా ఒక్కొక్కరం ఉన్నా మాది జాతీయ పార్టీ. తెలంగాణ సాధన కోసం మా పార్టీ అనేక ఉద్యమాలు చేసింది. కనీసం నిర్ణయాలను చేసే సమయంలోనైనా మా పార్టీలను రాజకీయ పార్టీగా గుర్తించి మాకు కూడా అవకాశం ఇవ్వాలి. మేము కేవలం ఉన్న వాస్తవాలను మాత్రమే మాట్లాడుతాము. కావున, స్పీకర్ గారు మమ్మల్ని కూడా గుర్తించాలని, ఇలాంటి చర్యలు పునరావృత్తం కాకుండా చూడాలని స్పీకర్ గారికి మనవి చేస్తున్నాను. మొన్న జరిగిన గవర్నరు గారి ప్రసంగంలోని విషయాలన్ని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన మొదటి బడ్జెట్ సమావేశాల్లో ఏ కార్యక్రమాల గురించి మాట్లాడారో, అవే కార్యక్రమాల గురించి, మళ్లీ ఉన్న కార్యక్రమాల గురించే రిపీట్ చేయడం జరిగింది. ముఖ్యంగా తెలంగాణ సాధనలో పోరాడి అమరులైన వీరుల విషయంలో, అమరులైన 369 మందిని గుర్తించామని, వారికి రూ.10 లక్షల రూపాయలను, అర్హత ఆధారంగా కుటుబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, వ్యవసాయ భూమి కానీ, ఇంటి స్థలం ఇస్తామని పోయిన బడ్జెట్ సమావేశాల్లో చెప్పడం జరిగింది. అప్పటినుండి ఇప్పటివరకు 4 మాసాల సమయం గడిచింది. ఉద్యమ సందర్భంలో 1200 మంది అమరుల త్యాగం తరువాత తెలంగాణ వచ్చిందని పదే పదే మనం చెప్పుకున్నాం. కానీ, ఇప్పుడేమో సంఖ్యను తగ్గించాం. అమర వీరులకు సంబంధించిన ఉద్యోగాల విషయం, డబ్బుల విషయం, భూ కేటాయింపుల విషయం గవర్నర్ గారి ప్రసంగంలో లేకపోవడం చాలా దురదృష్టకరం. ఈమధ్య కాలంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి గారు మెదక్ జిల్లాలో ఒక అమరవీరుల కుటుంబానికి రూ.10 లక్షల ఇస్తున్నట్లు వార్తా పత్రికల్లో చూడటం జరిగింది. మా ప్రాంతంలో కూడా చాలా మంది అమర వీరులైన కుటుంబాల వారు ఉన్నారు. కానీ, వారికి కూడా ఇప్పటి వరకు ఎటువంటి సహాయం అందలేదు.

(శ్రీ టి. హరీశ్ రావు మైక్ లేకుండా మాట్లాడుతూ ఆ సమయంలో ఎలక్షన్ కోడ్ రావడం జరిగింది అన్నారు.)

ఎలక్షన్ కోడ్ తరువాతైనా అమరవీరులను దృష్టిలో ఉంచుకొని ఆ కుటుంబాలను ఆదుకోవాలని తమరి ద్వారా ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. గిరిజనులకు 12శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తామని, గిరిజన తండాలను గ్రామ పంచాయితీలుగా మారుస్తామని, గత ప్రభుత్వం చేసిన చట్టం ఆధారంగా ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా వచ్చే నిధులను వారికే కేటాయిస్తామని ఈ ప్రసంగంలోను, గతంలోను అనేకసార్లు చెప్పడం జరిగింది. గిరిజనులకు సంబంధించి ఇది ప్రభుత్వం యొక్క రెండో బడ్జెట్. గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ పెంపుకు సంబంధించి ప్రభుత్వం చేస్తున్న చర్యల గురించి ఎక్కడ కూడా స్పష్టత లేదు. గిరిజన తండాలను, గూడెంలను గ్రామ పంచాయతీలుగా చేసేందుకు కావాల్సిన చర్యలు ఎక్కడకూడా ప్రారంభం జరిగినట్లుగా లేదు.

2.15 మ.

అందుకని మేము చాలా నష్టపోతున్నాము. ఈ బడ్జెట్‌లో 9.34 శాతం ఎస్‌టి సబ్‌ప్లాన్ ద్వారా నిధులు ఖర్చు చేయడానికి అలకేటు చేస్తున్నామని అన్నారు. 12 శాతం రిజర్వేషన్ అమలులోకి వస్తే మాకు రావలసిన నిధులు పెరుగుతాయి, ఎస్‌టి సబ్ ప్లాన్ పెరుగుతుందని, ఉద్యోగాలలో రిజర్వేషన్ శాతం పెరుగుతుందని, తెలంగాణలోని ఎస్‌టిలంతా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రెండు బడ్జెట్ సమావేశాలు జరిగాయి. బడ్జెట్ నిధులన్నీ ఖర్చు కాబోతున్నాయి. కాబట్టి ఈ దశలో గిరిజనుల గురించి ఆలోచన చేయవలసిన అవసరం ఉంది. గిరిజనులకు ఎన్నికల ముందు ఎన్నికలు అయిపోయిన తరువాత కూడా ముఖ్యమంత్రిగారు ప్రకటన చేసిన విధంగా దళితులతోపాటు గిరిజనులకు మూడు ఎకరాల భూమి కొనుగోలు పథకాన్ని అమలు చేస్తామని అన్నారు. గిరిజనులను అందిరినీ ఆదుకుంటామని ముఖ్యమంత్రిగారు పదే పదే చెప్పారు. గిరిజనులకు మూడెకరాల భూమి కార్యక్రమం మన గవర్నర్‌గారి ప్రసంగంలో లేకపోవడం చాలా విచారకరమని ఒక గిరిజన సభ్యుడిగా నేను ఆవేదన వ్యక్తం చేస్తున్నాను. దళితులకు భూమి కోనుగోలు పథకానికి సంబంధించి మన ప్రభుత్వం బ్రహ్మాండంగా ఆగస్టు 15నాడు గోల్కొండ కోట మీద ముఖ్యమంత్రిగారు, కొంతమంది దళితులను పిలిపించి భూముల పట్టాలు, పాస్ పుస్తకాలు పంపిణీ చేసి బ్రహ్మాండంగా ప్రచారం చేసుకున్నారు. అదే విధంగా మంత్రులందరూ ఆయా జిల్లా కేంద్రాలలో భూ పంపిణీ చేసి దళితులను బాగా ఆదరిస్తున్నామని ప్రచారం చేసుకోవడం జరిగింది. ఇప్పటి వరకు దాదాపుగా దళితులు తెలంగాణ రాష్ట్రంలో మూడు లక్షల ముప్పైవేల కుటుంబాలు ఈ భూమి కొనుగోలు పథకానికి అర్హులుగా గుర్తించబడింది. వారందరికీ పది లక్షల ఎకరాల భూమి పంపిణీ చేయవలసిన అవసరం ఉంటే ఇప్పటి

వరకు మన ప్రభుత్వం కేవలం 640 ఎకరాల భూమి మాత్రమే పంపిణీ చేసి, దళితులకు సంబంధించి భూమి కొనుగోలు పథకాన్ని బ్రహ్మాండంగా అమలు చేస్తున్నామని ఈ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటుంది. పోయినసారి బడ్జెట్‌లో రూ. 1000 కోట్లు దళితుల భూమి కొనుగోలు కోసం కేటాయించినా, పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేకపోయింది. వారి గురించి ఈ ప్రభుత్వం ఏమి ఆలోచన చేస్తుందని అడుగుతున్నాను. బిసిలకు సంబంధించి రానున్న 5 సంవత్సరాలకుగాను రూ.25వేల కోట్లు ఖర్చు చేసి, బిసిలను ఆదుకుంటామని, సంక్షేమ పథకాల ద్వారా వారు ఎదగడానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని గవర్నర్‌గారి ప్రసంగంలో చెప్పడం జరిగింది. పోయిన సారి బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు మాత్రమే బిసిలకు కేటాయించి, అందులో 20 శాతం నుండి 30 శాతం నిధులు కూడా ఖర్చు చేయలేక పోయింది. రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బిసిలను మోసం చేయాడానికి ప్రభుత్వం మభ్య పెడుతున్నది. దీని గురించి కూడా ఆలోచన చేయాలని తమరి ద్వారా మనవి చేస్తున్నాను.

శ్రీ ఈటల రాజేందర్ (ఆర్థిక శాఖ మంత్రి): గౌరవ సభ్యులు మాట్లాడుతూ మోసం చేస్తుంది ప్రభుత్వం అంటే అదేమి భాష? ఎన్నో ఏళ్లుగా కమ్యూనిస్టులు చేస్తున్న ఉద్యమాల సందర్భంగా మీరు పంచిన భూమి ఎంత? తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం మొట్టమొదటి సారిగా గవర్నమెంట్ భూములే కాకుండా ఎకరాకు రూ.2 నుండి రూ. 7 లక్షలు వరకు పెట్టి ఖర్చు పెట్టి అయినా వారికి భూమి కొనివ్వాలని చూస్తుంటే, అటువంటి పథకాన్ని స్వాగతించాలి. కాని ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు 260 ఎకరాలు గవర్నమెంట్ పరంగా, 1150 ఎకరాలు కొనిచ్చిన సందర్భం ఉంది. మనకు గతంలో అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బంది పడ్డ మాట వాస్తవమే. నిరంతరంగా ఏ జిల్లాలో ఎన్ని ఎకరాల భూమి అందుబాటులో ఉంది, వారివ్వడానికి సిద్ధ పడితే, మేము కొన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాము. ఏ ప్రభుత్వం ఆలోచన చేయని పథకాలను మా ప్రభుత్వం అమలు చేస్తుంటే విమర్శించాలని చూస్తున్నారు. మేము చేసే ప్రయత్నాన్ని స్వాగతించే ప్రయత్నం చేయండి. ఇంత చేసినా బిసిల విషయంలో మోసం చేస్తుందని అనకండి. ఈ ప్రభుత్వం బిసిలకనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు చేస్తుంది. నేను బడ్జెట్ రూపకల్పనలో ఉన్నాను కాబట్టి అవన్నీ చేస్తున్నాము. బిసి పిల్లలు చదువుకునే స్కూల్సులో, హాస్టల్సులో సన్న బియ్యం గురించి ఏ ప్రభుత్వాలు, ఏ పార్టీలు ఆలోచన చేయలేదు. తెలంగాణ ప్రభుత్వమే ఆలోచన చేసింది. కమ్యూనిస్టులు మంచిని మంచిగా, చెడును చెడ్డగా చెప్పండి. మీరు ఆ బాష వాడవద్దని కోరుతున్నాను.

శ్రీ రవీంద్ర కుమార్ రమావత్: పోయిన బడ్జెట్ సమావేశాలలో దళితులకు, గిరిజనులకు సంబంధించిన ప్రభుత్వ భూమితోపాటు ప్రయివేటు వ్యక్తుల భూములు కూడా కొనుగోలు చేసి ఇస్తామంటే కమ్యూనిస్టు పార్టీగా ఆహ్వానించాము, మిమ్మల్ని సమర్థించాము. మా ఆవేదన ఏమిటంటే భూమి కోసం పోరాటం చేసేది కమ్యూనిస్టు పార్టీ. గత అనేక సంవత్సరాలుగా భూపోరాటాలు చేసి, రక్షణ కల్పించి , అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ పరంగా భూములు పంపిణీ కోసం నాలుగున్నర వేల మంది ఆత్మ బలిదానం తరువాత పది లక్షల ఎకరాల భూమి పంపిణీ తెలంగాణా ప్రాంతంలో చేయించింది కమ్యూనిస్టు పార్టీయేనని మంత్రిగారు గుర్తు పెట్టుకోవాలి. పోయిన సారి అనౌన్స్ చేసిన పథకాన్ని కమ్యూనిస్టు పార్టీగా మేము ఆహ్వానించి మద్దతు తెలిపాము. రూ.1000 కోట్లు పోయిన బడ్జెట్‌లో కేటాయించారు, కాని దళితులకు సంబంధించిన భూమి కొనుగోలు పథకంలో. నాకున్న సమాచారం ప్రకారం 640 ఎకరాలన్నాను. అది తప్పని మంత్రిగారు 1150 ఎకరాలు ఇచ్చామన్నారు. సంతోషము. అదే విధంగా గిరిజనులకు ఇస్తామన్నారు. కాని దానికి సంబందించిన విషయాన్ని గవర్నర్‌గారి ప్రసంగంలో లేదు. ప్రభుత్వం మంచి చేస్తే సమర్ధిస్తాము. ఏదైనా సమస్య ఉంటే స్పందిస్తాము తప్ప అడ్డగోలుగా ప్రభుత్వం మీద బట్ట కాల్చి మీదవేయము. వేరే ప్రతిపక్షాల మాదిరిగా మాట్లాడే ఆలోచన మాది కాదు. ఇది ఒక మంచి కార్యక్రమం . దళితులకు మూడెకరాలిస్తామన్నారు. గిరిజనులకు కూడా ఇవ్వాలని కోరుతున్నాను. బిసిల విషయంలో గత బడ్జెట్‌లో కూడా అనుకున్నాము. వారి సంఖ్యకు తగ్గట్టుగా బడ్జెట్ కేటాయింపులు లేవని, పెంచాలని ఆలోచన తప్ప వేరే ఏమీ లేదని మంత్రిగారికి తెలియ చేస్తున్నాను.

అంగన్ వాడీ వర్కర్స్‌కు సంబంధించి ఆరోగ్య లక్ష్మి పథకం గురించి సునీత గారు చాలా చక్కగా చెప్పారు. ఆ పథకం ద్వారా గర్భిణీలకు, బాలింతలకు మంచి పౌష్టికాహారం ఇస్తామన్నారు, చాలా సంతోషం . కాని అంగన్‌వాడీ వర్కర్స్‌కు , ఆయాలకు జీతభత్యాలు చాలా తక్కువగా ఉన్నాయి. అంగన్ వాడీ వర్కర్సుకు రూ.4250, ఆయాలకు రూ.2700, మినీ అంగన్ వాడీ సెంటర్సుకు రూ.1500 అలాంటి గౌరవ వేతనం వారికి తక్కువ జీతభత్యాలు ఇచ్చి, అంత పని చేయించడమంటే శ్రమ దోపిడి తప్ప ఇంకొకటి కాదు. వారికి జీతభత్యాల పెంపుదల కోసం ముఖ్యమంత్రిగారితో మాట్లాడండి. గత సమావేశాల సందర్భంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జీతాలు పెంచాలని ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. వారి పెంపుదల కోసం, రెగ్యులరైజేషన్ కోసం ప్రభుత్వం ఆలోచన చేయాలని తమరి ద్వారా ప్రభుత్వానికి తెలియ చేస్తున్నాను.

హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించి బలహీన వర్గాలు, వారికి సంబంధించిన పక్కా గృహాల నిర్మాణానికి సంబంధించి, పాత ఇందిరమ్మ ఇళ్లు కట్టుకున్న వారికి ఇంతవరకు బకాయిలు చెల్లించలేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇళ్ల నిర్మాణం చేసుకొని గవర్నమెంట్ రికార్డుల ప్రకారం రూ.141 కోట్లు పెండింగు బకాయిలున్నాయి. పోయిన బడ్జెట్‌లో కూడా చెప్పాము. రూ.1000 కోట్లు కేటాయించారు. కాని ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదు. అప్పుడున్న ప్రభుత్వం బేస్‌మెంట్ కట్టుకుంటే తెల్ల కార్డులున్న వారికి ఇళ్లు మంజూరు చేస్తామంటే చాలామంది ఇళ్లు కట్టుకున్నారు, కొంతమంది లెంటల్ లెవెల్, కొంతమంది పూర్తిగా ఇళ్లు కట్టుకున్నారు. వారెవరికీ ఇంత వరకు డబ్బులు చెల్లించలేదు. రూ.3.5 లక్షలతో డబుల్ బెడ్ రూమ్, హాల్, కిచెన్, టాయిలెట్, ఇంటి ముందు చెట్టు గేటెడ్ కమ్యూనిటీలో పక్కా గృహం అన్నారు. రెండు బడ్జెట్ సమావేశాలు పూర్తి కావస్తున్నా ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదంటే బలహీన వర్గాల గురించి మంత్రిగారు ఏమి ఆలోచన చేస్తున్నారో తెలపాలని కోరుతున్నాను.

విద్యకు సంబంధించి కేజి నుండి పీజి అన్నారు. చాలా మంచి పథకం. అందరి పిల్లలకు ఒకే విద్యా విధానం కావాలని కమ్యూనిస్టు పార్టీ తరఫున చాలా సంవత్సరాలుగా మేము పోరాటం చేస్తున్నాము. నాణ్యమైన విద్యను కేజి నుండి పీజి వరకు అందిస్తామని, ఉద్యోగాలు కూడా కల్పిస్తామని చెప్పారు. చాలా సంతోషం. కాని ఇప్పటి వరకు మొదలు పెట్టలేదు. ఇప్పటికే ఒక విద్యా సంవత్సరం అయిపోయింది. మరొక విద్యా సంవత్సరం రాబోతోంది. దీని గురించి ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరుతున్నాను. గతంలో ఫాస్ట్ అన్నారు. ఫాస్ట్ లేదు, గీస్ట్ లేదు. ఫీజు రీ ఇంబర్స్‌మెంట్‌కు సంబంధించి 1956 స్థానికత అన్నారు. అది పోయింది. నాలుగు సంవత్సరాలుంటే చాలంటున్నారు. వీటిలో స్పష్టత ఇవ్వాలని కోరుతున్నాను. ఈ పథకాలను చక్కగా అమలు చేస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. అందరికీ మేళ్లు జరుగుతాయి, అందరూ అభివృద్ధి చెందుతారని తప్ప విమర్శించాలని కాదు. మనం ప్రకటించిన విధంగా కెజి నుండి పిజి పథకాన్ని త్వరగా అమలు చేసి పేదవారిని ఆదుకోవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను.

మహిళల భద్రతకు సంబంధించి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, షీ టీమ్ బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. చాలా బాగుంది. పోలీసు వ్యవస్థలో పోలీసులకు జిల్లా స్థాయిలో వారికి స్కార్పియోలు, హైదరాబాదులో ఇన్నోవాలు కొన్నిచ్చారు. చాలా బాగుంది. మహిళల కోసం లింగ బేధం లేకుండా ఆదరిస్తున్నామని, అదే ప్రభుత్వ లక్ష్యమని చెబుతున్నారు. కాని ముందు వరుసలో మహిళలు ఎవరూ లేరు అంటే మహిళా మంత్రులు ఎవరూ లేరు. వారికి అవకాశం కల్పించాలి. నిన్ననే అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. మీరందరూ మాట్లాడారు. 50 శాతం ఉన్న మహిళలకు కూడా మంత్రిగా అవకాశం కల్పిస్తే బాగుంటుందని కోరుతున్నాము.

హైదరాబాదు అభివృద్ధి విషయానికి గౌరవ ముఖ్యమంత్రిగారు మాట్లాడే ప్రతి సందర్భంలో హైదరాబాదు గురించి చాలా బ్రహ్మాండంగా మాట్లాడుతున్నారు. హైదరాబాదు నగరంలో వర్షం వస్తే అసెంబ్లీ ముందు నుండి, రాజ్‌భవన్ ముందు నుండి మోకాళ్ల లోతు నీళ్లు పోతుంటాయి. హైదరాబాదు నగరం అంత పద్ధతి ప్రకారం లేదని, రానున్న రోజులలో మునిగిపోతుందని, కాపాడుకోవలసిన అవసరం ఉందని ముఖ్యమంత్రిగారు చెబుతూ ఉంటారు. హైదరాబాదు మన రాష్ట్ర రాజధాని. దీని ఎంతగా అభివృద్ధి చేస్తే అంతగా పరిశ్రమలు వస్తాయి. మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తారు. తొమ్మిది నెలల కాలంలో ఏమి చేశాము? హైదరాబాదు నగరంలో కనీసం గతుకుల రోడ్లు అయినా బాగు చేశారా? ట్రాఫిక్ వ్యవస్థ ఎలా ఉంది? ఉదయం ఇక్కడికి రావాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ మొదలయ్యాయి, బాగా రష్ ఉంది , అసెంబ్లీకి రావడానికి అర్థగంట సమయం పడుతుంది, రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి . మంచినీటి సరఫరా బాగా లేదు. కరెంటు కోత వస్తుంది. మనం చెప్పే దానికి చేసే దానికి కొంచెం ఆలోచన చేసి హైదరాబాదు నగరాన్ని విశ్వ నగరంగా చేస్తామన్న ప్రభుత్వం, త్వరగా ఆ ఆలోచనను అమలులోకి తీసుకు రావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

రైతుల రుణ మాఫీ చాలా మంచి కార్యక్రమం. 25 శాతం మాత్రమే మొదటి దశ అమలుకు డబ్బులు కేటాయించాము. మన ప్రభుత్వం ఆ నిధులను బ్యాంకులకు అప్ప చెప్పింది.

2.30 మ. అధ్యక్షా, బ్యాంకర్స్ ఏమి చేశారు? 25 శాతాన్ని పాత బకాయి కింద వసూలు చేసుకున్నారు. ఉదాహరణకు లక్ష రూపాయలు బ్యాంకు నుండి అప్పు తీసుకుంటే, రూ.17,000/ వడ్డీ అవుతుంది. ఒక లక్షా పదిహేడు వేల రూపాయల రుణం కింద లెక్కకట్టి అందులో 25 శాతం పాత బకాయిల కింద వసూలు చేసుకుంటున్నారు, రైతులకు కొత్తగా అప్పులిచ్చే పరిస్థితి కనబడడం లేదు. రైతు రుణాలు పూర్తి స్థాయిలో .....

శ్రీ ఈటల రాజేందర్: అధ్యక్షా, గౌరవ సభ్యులు లోన్లగురించి ప్రస్తావించారు. రేపు సమాధానం చెబుతాను కాని ఇప్పుడు వారిని ఎడ్యుకేట్ చేసే ప్రయత్నం చేస్తాను. గత ప్రభుత్వం రూ. 3370/ కోట్లు రుణ మాఫీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు అప్పుల భారంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు కాబట్టి రైతాంగానికి రుణ విముక్తి

కలిగించాలని, కట్టిన వాళ్లు, కట్టని వాళ్ల అని సంబంధం లేకుండా రూ. 17,000 కోట్లు రుణమాఫీకి సంబంధించి అనౌన్స్ చేయడం జరిగింది. వడ్డీతో సహా రుణమాఫీ చేస్తామని ప్రకటించడం జరిగింది. ఎక్కడైనా లొసుగులుంటే మా దృష్టికి తీసుకురండి, రెక్టిఫై చేస్తాము. ఇప్పుడు రెండో ఇన్‌స్టాల్‌మెంట్ ఇవ్వబోతున్నాము. నలభై నుండి యాభై శాతం స్కేల్ పెంచి ఇచ్చాము. రేపు వంద శాతం రుణాలు రాబోతున్నాయి. ఆ విధంగా పాత బకాయిలు కింద జమచేసినట్లుగా, కొత్త రుణాలు ఇవ్వడం లేదని మా దృష్టికి తీసుకొస్తే రెకిఫై చేస్తాము.

శ్రీ ఆర్. రవీంద్రకుమార్: అధ్యక్షా, స్వయంగా నేను కూడా అప్పు తీసుకున్నాను కాబట్టి చెబుతున్నాను. లక్ష రూపాయలకు, రూ.17000/ వడ్డీ అయ్యింది. లక్షా పదిహేడు వేల రూపాయలకు, రూ. 25,000/ బకాయి కింద పెట్టుకొని నాకు ఏడు వేల రూపాయల చిల్లర ఇవ్వడం జరిగింది.

శ్రీ ఈటల రాజేందర్ : అధ్యక్షా, వడ్డీతో కలిపి లక్ష రూపాయలలోపు వరకూ మాత్రమే మాఫీ చేయడం జరుగుతుంది. వారు చెబుతున్న ప్రకారం రూ. 1,17,000/ అయితే, లక్షరూపాయల వరకూ ప్రభుత్వం కడుతుంది, వారు మిగిలిన డబ్బు చెల్లించవలసి ఉంటుంది.

శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి (వ్యవసాయ శాఖ మంత్రి): అధ్యక్షా, రుణమాఫీ పథకం తెలంగాణ రాష్ట్రంలో ఆదర్శవంతంగా అమలు చేస్తున్నాము. ముప్పై ఆరు లక్షల మంది రైతులకు రుణ మాఫీ చేస్తే ఇప్పటికీ రూ. 16,870 కోట్లు రైతులకు రెన్యువల్ ద్వారా డబ్బు తిరిగి ఇవ్వడం జరిగింది. కొన్ని జిల్లాలలో రుణ మాఫీ చేసిన దానికంటే, ఎక్కువ డబ్బు రెన్యువల్ క్రింద ఇవ్వడం జరిగింది. ముఖ్యమంత్రి గారు ఎన్నికల హామీలో లక్షరూపాయల లోపు రుణాలను మాఫీ చేస్తామని అన్నారు, ఇంక్లూడింగ్ ఇంట్రెస్ట్ అన్నమాట. లక్ష రూపాయలు లోపు తీసుకుంటే, లక్ష రూపాయల వరకూ మాఫీ చేస్తున్నాము, లక్ష రూపాయలు తీసుకుంటే, దానిపైన అయిన వడ్డీ రైతు చెల్లించుకుంటే, చెల్లించిన వెంటనే రెన్యువల్ చేయడం జరుగుతుంది. లక్ష రూపాయల కంటే ఎక్కువగా తీసుకున్న వారు, ఇంట్రెస్ట్ ఎక్కువ అవ్వడం వల్ల, కట్టలేకపోవడం వల్ల, బ్యాంకులకు వెళ్లలేకపోవడం వల్ల కొంతమందికి సరిగ్గా అందలేదు. చాలా మంది తీసుకున్నారు. ముప్పై ఆరు లక్షల మంది రైతులకు దాదాపు పదిహేడు వేల కోట్ల రూపాయలు రుణమాఫీ జరిగిందంటే, అన్ని బ్యాంకులూ సహకరించాయి. ఫైనాన్స్ మినిస్టర్‌గారు చెప్పినట్లు ఎక్కడైనా బ్యాంకర్లు ఇబ్బంది పెడితే ప్రభుత్వం దృష్టికి తీసుకురండి, తప్పనిసరిగా ఆ జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని మనవి చేస్తున్నాను.

శ్రీ ఆర్. రవీంద్రకుమార్ : అధ్యక్షా, కొన్ని ప్రాంతాలలో బ్యాంకర్లు సహకరించడం లేదు. కొత్త అప్పులు ఇవ్వకపోవడం వల్ల, రైతులు ప్రైవేట్ వ్యక్తుల దగ్గర అప్పుతెచ్చుకోవడంతో ఇబ్బంది పడుతున్నారు, ఈ విషయాన్ని గమనించమని కోరుతున్నాను. మా ప్రాంతంలో రెండు, మూడు చోట్ల, బాంకర్లు, కరువు వచ్చిందని, రైతులకు సంబంధం లేకుండా బ్యాంకు అధికారులే రీషెడ్యూల్ చేసుకున్నారు. అలాంటి చోట్ల మాఫీ అవ్వలేదు. అక్కడున్న రైతులు ఇబ్బంది పడుతున్నారు, గౌరవ మంత్రి గారు ఈ విషయమై ఆలోచన చెయ్యాలని కోరుతున్నాను. అదే విధంగా నక్కలగండి ప్రాజెక్టు విషయం గురించి కూడా మాట్లాడారు. మా జిల్లా ప్రజలు ఫ్లోరోసిస్‌తో ఇబ్బంది పడుతున్నారు. నక్కలగండి దిండి, ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయడానికి ఆలోచిస్తున్నామా లేక నక్కలగండి రిజర్వాయర్ కట్టడమా అనేది స్పష్టం చేయాలి. నక్కలగండి నుండి దిండి ఎత్తిపోతల పథకానికి సంబంధించి ప్రాజెక్ట్ చేపట్టవలసిందిగా, ముఖ్యమంత్రి గారు హైపవర్ కమిటీలో నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిసింది. పరిపాలనా అనుమతులు తొందరగా ఇప్పించి, ఈ బడ్జెట్‌లో కొద్దోగొప్పో నిధులు కేటాయించి ప్రారంభం చేస్తే మా నల్గొండ ప్రజలు రుణపడి ఉంటారు, ఆ విధంగా మంత్రి గారు ఆలోచన చెయ్యాలని ఈ సందర్భంగా కోరుతున్నాను. డిపిఆర్ కూడా వచ్చింది.

రానున్న మూడు సంవత్సరాలలో 6000 మె.వా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తామని గవర్నర్ గారి ప్రసంగంలో చెప్పడం జరిగింది. పోయిన బడ్జెట్ సమావేశాలలో 21,000 మె.వా ఉత్పత్తి చేస్తుందని చెప్పడం జరిగింది. ఈ విషయమైకూడా ఆలోచన చెయ్యాలి. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులలో నుండి ముప్పై శాతం నిధులు కూడా ఖర్చుపెట్టలేదు. ఈసారి అలా జరగడానికి వీలు లేదు. ఈ ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు చేసింది. కాంట్రాక్ట్ ఉద్యోగులు, నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. నల్గొండ ప్రజలు త్రాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు, రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. కరవు మండలాలను ప్రకటించలేదు. ప్రభుత్వం ఆలోచన చేసి, తెలంగాణ ప్రజలను ఆదుకునే పద్ధతిలో పయనించాలని సిపిఐ పార్టీ తరపున కోరుతున్నాను.

శ్రీ సున్నం రాజయ్య (భద్రాచలం): అధ్యక్షా, మాకు ఆఖరి బెంచిలిచ్చారు. మాది జాతీయ పార్టీ, మా సీట్లను మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నాను. గవర్నర్ ప్రసంగంలో కొత్తదనం ఏమీ లేదు. 339 మండలాలలో తీవ్రమైన కరవు ఉంది. గవర్నర్ గారి ప్రసంగంలో ఆ మాట రాలేదు. ప్రభుత్వాధికారులు, జిల్లా అధికారులు 481 కరవు మండలాలని నివేదికనిచ్చారు. గవర్నర్ ప్రసంగంలో ఆ మాట

లేకపోవడం శోచనీయం. రేపు సమాధానం చెప్పేటప్పుడు కరవు మండలాలను ప్రకటించాల్సిందే. 800 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆ విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోలేదు. మన ప్రభుత్వం రైతుల కుటుంబాలకు ఏ విధమైన భరోసా ఇస్తున్నారని అడుగుతున్నాను. భద్రాచలం, అశ్వారావు పేట, వరంగల్, అదిలాబాద్, రంగారెడ్డి ప్రాంతాలలో అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రతి గిరిజనుడికి పదెకరాల భూమి ఇవ్వాలి. ఆ చట్టం అపహాస్యం అయ్యింది. మా ప్రాంతంలో ఇల్లెందు, అశ్వారావుపేట గిరిజన రైతులకు రక్షణ లేదు. అటవీ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వారు పదహేను సంవత్సరాల నుండి పోడు భూమి చేసుకుంటున్నారు. నేను అసెంబ్లీలో ఈ విషయమై అడుగుతానని చెప్పాను. అటవీ అధికారుల నిర్భంధాన్ని ఆపాలి, గిరిజనులకు రక్షణ కల్పించాలని మా డిమాండ్.

2.45 మ. 4.8 శాతం నుంచి 5.3 శాతంగా గ్రోత్ రేటు పెరిగిందని చెప్పారు. కానీ, ఎక్కడ కూడా పెరగలేదు. ఈ రోజు చాలా ఇబ్బందికర వాతావరణ ఉన్నది. గవర్నరు గారు చెప్పిన ప్రసంగం అవాస్తవానికి దగ్గరగా ఉందని భావిస్తున్నాను. మేము 11 సవరణలను ప్రభుత్వానికి, కార్యదర్శి గారికి విన్నవించాము. ఆ సవరణలన్నింటిని కూడా భేషరతుగా ఆమోదించాలని కోరుతున్నాము. వాటిలో ముఖ్యంగా 3.5 లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన వివిధ కార్యాలయాల్లో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ఎన్నికల ముందు టి.ఆర్.ఎస్ పార్టీ "మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని కూడా పర్మినెంట్ చేస్తామని హామి"ఇచ్చింది. ఈ రోజున కాంట్రాక్ట్ ఉద్యోగులందరు కూడా నిరాశనిస్పృహల్లో ఉన్నందున వారందరిని రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నాను. అదే విధంగా పరిశ్రమల విషయంలో కాగజ్‌నగర్, వరంగల్, కమలాపురంలో ఉన్నటువంటి పరిశ్రమలు మూతపడినందున, వేలాది మంది కార్మికులకు రెండు నుంచి ఆరేళ్లుగా ఉద్యోగం లేక బజారున పడిన పరిస్థితి ఉంది. ఖాయిలా పడిన పరిశ్రమల, మూత పడిన పరిశ్రమల విషయంలో ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటుందో తెలియజేయాలని కోరుతున్నాను. అదే విధంగా ప్రభుత్వం ఈ పరిశ్రమల విషయంలో స్పష్టమైన హామి ఇవ్వాలని కోరుతున్నాము. ఈ రోజు హైదరాబాదు నగరంలో వైద్యం పేదలకు అందని ద్రాక్ష పండులాగ తయారయ్యింది. ప్రభుత్వం గత సమావేశాల్లో ఉస్మానియా వైద్యశాలకు కు రూ.100కోట్లు, గాంధీకి రూ.100 కోట్ల కేటాయించమని చెప్పడం జరిగింది. కానీ, నేను వారం రోజుల క్రితం ఉస్మానియా హాస్పిటల్‌కు మా నియోజక వర్గానికి సంబంధించి ఒక వ్యక్తికి ట్రీట్‌మెంట్ కోసమని వెళ్తే, హాస్పటల్ మొత్తం కూడా దుర్గంధపూరితమైన వాసన, ఎటువంటి మెయింటనెన్స్, ఆలనాపాలనా కూడా లేకుండా ఉన్నది. గాంధీ హాస్పటల్ పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. చావుబ్రతుకుల్లో ఉన్న ఒక ఎమ్‌పిపి భార్యకు వైద్యానికి అంటెండ్‌గా వెళితే 5 ఫ్లోర్‌లు నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. రోగుల వద్దకు వచ్చే వందలు, వేలాది మందికి కేవలం ఒక లిఫ్ట్ ఉండటం వల్ల సమస్య ఉంది. రాజధాని నగరంలో ఉన్న గాంధీ, ఉస్మానియా హాస్పటల్స్‌కు ఆలనాపాలన లేని పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో ఉన్నటువంటి వైద్యశాలల పరిస్థితి చెప్పలేకుండా ఉంది. వైద్యశాలల్లో వైద్యులు ఉండరు, వైద్యులు ఉంటే మందులు ఉండవు, సిబ్బంది కూడా లేరు. ఈ పరిస్థితులను మెరుగుపర్చాల్సిన అవసరం ఉన్నది. విష జ్వరాలు కూడా వచ్చే పరిస్థితి ఉంది. గవర్నర్ గారి ప్రసంగానికి రిప్లై చెప్పే సమయంలో ఈ విషయాల్లో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి చెప్పాలని కోరుతున్నాను. అదే విధంగా ప్రభుత్వ హాస్టల్స్‌కు సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని ఆర్థిక మంత్రి గారు తెలియజేసినందుకు చాలా సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నాను. పక్క రాష్ట్రంలో హర్యానా బియ్యంను హాస్టల్స్‌కు ఇస్తున్నారు. అవి జంతువులు కూడా తినడానికి వీలు లేనివిగా ఉన్నాయి. సన్న బియ్యం సరఫరా చేస్తున్నందుకు ధన్యవాదములు. కానీ, ఉపకార వేతనాల విషయం గురించి ఏమి చర్యలు తీసుకున్నారని ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. మూడు సంవత్సరాల క్రితం నిర్ణయించిన లెక్కల ప్రకారం ఉపకార వేతనాలను రూ.700-800 గా విద్యార్థులకు ఇస్తున్నారు. ఈ డబ్బులకు ఇప్పుడున్న ధరల ప్రకారం ఉప్పు, నూనే, సబ్బు, కూరగాయలు కూడా రావు. హైదరాబాద్ లాంటి నగరాల్లోని బజారుల్లో టీ, టిఫిన్ చేస్తేనే రూ.50 అవుతుంది. ఒక విద్యార్థికి సగటున రోజుకి రూ.50 కూడా ఇవ్వడం లేదు. కావున, తప్పకుండా ఉపకార వేతనాలను పెంచాల్సిన అవసరమున్నదని తెలియజేస్తున్నాను. హాస్టల్స్‌లో ఉండే గిరిజన, దళిత, బిసి, మైనారిటి, ఇతరపిల్లలందరికి కాలేజీ స్థాయిలో రూ.2వేలు, హైస్కూల్ స్థాయి విద్యార్థులందరికి 1500 రూపాయలను ఉపకారవేతనంగా ఇవ్వాల్సిందేనని కోరుతున్నాను. గవర్నరు గారి ప్రసాంగానికి రిప్లై ఇచ్చే సమయంలో విద్యార్థుల ఉపకార వేతనాలను పెంచుతున్నారా? లేదా అనే విషయాన్ని కూడా స్పష్టంగా తెలియజేయాలని కోరుతున్నాను. ప్రభుత్వం "కాకతీయ మిషన్" పథకాన్ని ప్రవేశ పెట్టినందుకు చాలా సంతోషిస్తున్నాను. " కాకతీయ మిషన్" తోబాటుగా మూలనపడిన ఎత్తిపోతల పథకాలను, ప్రాజెక్టులను చేపట్టాలి. ఖమ్మం జిల్లాలో దాదాపుగా 400 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు ఉన్నాయి. నా భద్రాచలం నియోజకవర్గంలోనే 150 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు ఉన్నాయి. ఇవన్నీ కూడా పడావ పడి, మూలనపడి ఏ

ఒక్కటి కూడా పనిచేసే స్థితిలో లేవు. వాదేడులో ఉన్న మూరుకొండ ప్రాజెక్టు ద్వారా 20వేల ఎకరాల భూమి సాగులోకి వచ్చే పరిస్థితి ఉంది. ఆనాడు జలయజ్ఞం అన్నారు. కానీ, ఆ యజ్ఞం అట్లానే పోయింది. ఆ రోజు రూ.60 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు వ్యయం ఈ రోజు రూ.200 కోట్లకు పెరిగింది. కానీ, ఈ రోజు మీరు ఆ ప్రాజెక్టును ఏవిధంగా పునరుద్ధరణ చేస్తారో తెలియజేయాలని కోరుతున్నాను. ఎత్తిపోతల పథకాల, మీడియం ప్రాజెక్టుల, మేజర్ స్కీమ్స్‌లను పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉన్నది. వాదేడు వద్ద మూరుకొండు ప్రాజెక్టు, వద్దిపేట చెక్‌డ్యాం కింద ఉన్నటువంటి 20 గిరిజన గ్రామాల్లో ఈ రోజు పంటలు పండలేదు, ఆ గ్రామాల్లో ఉన్న ప్రజలు త్రాగు నీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. వద్దిపేట మండలం చర్లపల్లిలో "చెక్‌డ్యాం" ఏర్పాటు చేయాలని రైతులందరు కోరుతున్నారు. ఈ విషయంలో కూడా ప్రభుత్వం ఏమి ఆలోచన చేస్తుందో తెలియజేయాలని కోరుతున్నాము. నా నియోజకవర్గంలోని గోదావరి నదిపై దుమ్ముగూడం వద్ద గల ప్రగడ పల్లి ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటుచేస్తే అక్కడ ఉన్న 35 గిరిజన గ్రామాలు సశ్యశ్యామలం అవుతాయి. అటువంటి శాశ్వతమైన నీటి వనరుల గురించి కూడా ఎటువంటి ఆలోచన లేదు. ఈ అన్ని రకాల పథకాల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన హామి ఇవ్వవల్సిన అవసరం ఉంది. ఈ రోజు మంచి నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నందున ఈ విషయంలో ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటుందో స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉందని తెలియజేస్తున్నాను. ప్రభుత్వం గవర్నరు గారి ద్వారా అవాస్తవాలను చెప్పించింది. గ్రామాల్లో మంచి నీటికి సంబంధించిన పథకాలు పనిచేయడం లేదు. కరెంటు లేదు, మోట్లారు, బోర్లు పనిచేయడం లేదు. మీరు " వాటర్ గ్రిడ్ " ద్వారా 3 సంవత్సరాల తరువాత ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీటిని అందిస్తామని చెబుతున్నారు. కానీ, మీరు ఈ పథకానికి ఈ రోజు శంకుస్థాపన చేస్తే, అవి పూర్తి కావాలంటే 3 సంవత్సరాల కాలం పడుతుంది. అప్పటి వరకు ప్రజలకు త్రాగడానికి మంచి నీళ్ల అవసరం లేదా? గ్రామాల్లోని ప్రజలకు మంచి నీళ్ల దొరకాక గొంతెండి పోతుంది. ఆ పథకాల మరమ్మతులకు, మెయింటనెన్స్‌ను ఏవిధంగా చేపడతారనే విషయంలో స్పష్టమైన హామి ఇవ్వాలని కోరుతున్నాను. భద్రాచలం పట్టణంలో మంచి నీటి పథకం కోసం 3 సంవత్సరాల క్రితం రూ.20 కోట్లు కేటాయించడం జరిగింది. 60-70 వేల జనాభ ఉన్నటువంటి ఏ ప్రాంతంలో కూడా మంచి నీటి స్కీములు పని చేయడం లేదని గత ఆరు నెలలుగా అనేక సార్లు అధికారులకు, జిల్లా కలెక్టరు గారికి మనవి చేయడం జరిగింది. గ్రామాల్లో కూడా అదే పరిస్థితి కొనసాగుతుంది. కావున, ఈ మంచి నీటి విషయంలో ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటుందో తెలియజేయాలని కోరుతున్నాను. సంక్షేమ కార్యక్రమాల విషయంలో ప్రభుత్వం చేపట్టిన "ఆసరా" పథకం చాలా మంచి పథకమని తెలియజేస్తున్నాను. గత అసెంబ్లీ సమావేశాల్లో "ఆసరా" పథకంలో ఉన్న ఇబ్బందుల గురించి అడిగితే పంచాయతీరాజ్‌శాఖ మంత్రి గారు ఇచ్చిన ఆదేశాల మేరకు అప్పుడు కొంత మేర యంత్రాంగం పని చేసింది. అంగన్‌వాడి వర్కర్లు కానీ, ఉద్యోగస్తులు కానీ, పోలీసులు కానీ చుట్టాలుగా ఉన్న వాళ్లకి పింఛను రాదని క్రింద స్థాయిలో ఉన్న రెవిన్యూ సిబ్బంది, ఎమ్మార్వో, ఎమ్‌డివోలు మాకు నియమనిబంధనలు అడ్డువస్తున్నాయని పింఛనులను తిరస్కరిస్తున్నారని నాకు ఇప్పుడే ఒక ఫోన్‌కాల్ రావడం జరిగింది. "ఆసరా" ద్వారా పింఛన్ పొందడానికి పై కారణాలున్నా పింఛను తిరస్కరించరని ఈ శాసన సభ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు హామి ఇవ్వాల్సిన అవసరమున్నదని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ప్రభుత్వం చేపట్టిన "కళ్యాణ లక్ష్మి" పథకం చాలా మంచి పథకమని తెలియజేస్తున్నాను. కానీ, రాష్ట్రంలో ఎక్కడ కూడా "కళ్యాణలక్ష్మి" పథకం అమలు జరగడం లేదు. గిరిజనులకు, దళితులకు, మైనారిటీలకు ఈ పథకం అమలు చేశారు. అదేవిధంగా బిసిలకు, వృత్తిదారులకు కూడా కళ్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని మా పార్టీ ద్వారా ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నాను. బిసిలకు, వికలాంగులకు, వృత్తిదారులకు కూడా "సబ్‌ప్లాన్" పెట్టవల్సిన అవసరమున్నదని కోరుతున్నాము. ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ "సబ్‌ప్లాన్"కు రూల్సు ఫ్రేము చేయలేదు. ఈ పథకానికి సంబంధించిన నిధులు, వనరులు ఏమిటి, రేపటి రోజు వీటిని ఏవిధంగా చేస్తారో కూడా తెలియజేయలేదు. ఈ విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టమైన హామి ఇవ్వాలని కోరుతున్నాను. టూరిజం విషయంలో యాదగిరి గుట్ట కొరకు ముఖ్యమంత్రి గారు రూ.100 కోట్లు కేటాయించారని సోదరి సభ్యరాలు తెలియజేశారు. ఈ విషయంలో మేము చాలా సంతోషిస్తున్నాం. నా భద్రచలంలో ఉన్నటువంటి "శ్రీ సీతారాముల దేవస్థానం" ఉత్తర భారతదేశంలోనే గొప్ప పుణ్యక్షేత్రం. భద్రాచలంలో పుష్కరాల కోసం ప్రభుత్వం రూ. 5 కోట్లో, రూ.10 కోట్లో కేటాయిస్తే ఎలా సరిపోతాయి. భద్రాచలం యాదగిరి గుట్ట, వేముల వాడ పుణ్యక్షేత్రం కన్నా పెద్ద క్షేత్రం. కావున, కనీసం రూ.150 కోట్లు ఇవ్వాలి. ఆలయానికి అనుబంధంగా పర్ణశాల ఉన్నది. దేశ, విదేశాల నుంచి భక్తులు భద్రాది రాముడిని సందర్శించి పర్ణశాలకు వెళ్తారు. ఈ భద్రాచలం, పర్ణశాలకు రూ.150 కోట్లు రూపాయలు ఇస్తానే అక్కడ టూరిజం అభివృద్ధి చెందుతుంది. గిరిజన ఆరాధ్య దైవం వాదేడు లోని "వీరమయి జాతర ". జరుగుతుంది. ఇక్కడికి ఛతీస్‌ఘడ్, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వస్తారు.

గిరిజన మంత్రి గారి వరంగల్ ప్రాంతం నుంచి కూడా ఇక్కడికి భక్తులు వస్తుంటారు. అక్కడ ఎటువంటి కనీస సౌకర్యాలు, ఆహార సౌకర్యాలు కూడా లేవు. గోదావరి నది ఒడ్డున ఉన్న ఈ జాతరకు కూడా నిధులు ఇవ్వాల్సిన అవసరమున్నది. చర్ల మండలంలో "సమ్మక్క-సారక్క" జాతర జరిగిన సమయంలో త్రాగడానికి మంచి నీళ్లు కూడా లేని పరిస్థితుల్లో మా కలెక్టరు గారిని, పి.ఓ గారిని కోరితే మంచి నీళ్లను సమకూర్చడం జరిగింది. అక్కడ శాశ్వతమైన మంచి నీటి ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. ఈ ప్రాంతాన్ని కూడా టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నాను. మీరు చెప్పినట్లుగా "బంగారు తెలంగాణ" రావాలంటే, తెలంగాణ సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే వనరులు, నిధులు సక్రమంగా ఇచ్చి పనులు చేయాల్సిన అవసరమున్నది. ఈ రోజు వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం, భద్రాచలం నియోజకవర్గంలో ఉన్న యువకులు "ఏజెన్సీ డిఎస్సీ" కొరకు ఎదురుచూస్తూ నిరాశ, నిస్పృహల్లో ఉన్నారు. ఈ రోజు ఉపాధ్యాయ పోస్టుల్లో చాలా ఖాళీలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో "స్పెషల్ డిఎస్సీ" ను నిర్వహించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను నింపి, నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించాలని కోరుతున్నాను. 2010-11 సంవత్సరంలో గత ప్రభుత్వం డిఎస్సీని నిర్వహించింది. మీ ప్రభుత్వం వచ్చిన ఈ కొత్త సంవత్సరం సందర్భంగా నిరుద్యోగులకు ఉపాధి చూపించాల్సిన అవసరమున్నది. ప్రభుత్వం వెంటనే "స్పెషల్ డిఎస్సీ" ని ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. "ఉపాధి హామి పథకం" పేదలకు వరం లాంటి పథకం. ఈ పథకాన్ని అమలు జరపాలని దేశ రాజధాని ఢిల్లీలో సి.పి.ఎమ్ పార్టీ త్రిపుర ముఖ్యమంత్రి ధర్నా చేశారు. ఈ విషయంలో పంచాతీ రాజ్ శాఖ మంత్రి గారు తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని ప్రభుత్వం కూడా ఆమోదించింది. కానీ, ఈ రోజు "ఉపాధి హామి పథకం" బిల్లులు చెల్లించే పరిస్థితి లేదు. ప్రతి మండలంలో "ఉపాధి హామి పథకం" క్రింద రూ.10 లక్షలు, రూ.20 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అడిగిన పేదలందరికి పని కల్పించాల్సిన భాద్యత ప్రభుత్వం మీద ఉన్నది. "ఉపాధి హామి పథకాన్ని " అమలు చేయాల్సిన అవసరమున్నదని తెలియజేస్తున్నాను. "ఆశా" వర్కర్లకు ప్రభుత్వం రూ.400 గౌరవ వేతనంగా ఇస్తున్నది. కానీ, గత 20 నెలలుగా "ఆశా" వర్కర్లకి జీతాలు ఇవ్వకపోవడం వల్ల ఆశా వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారు. వాళ్లకు ఇచ్చే రూ.400 గౌరవ వేతనం ఆ మహిళల కాస్ట్యూమ్ ఖర్చులకు కూడా సరిపోవని తెలియజేస్తున్నాను. గ్రామ సీమల్లో పేదవాడికి ఎటువంటి జబ్బు, రోగం వచ్చినా, వారికి మందులు, వైద్య సేవలు అందించే ఆశా వర్కర్లకు గత 20 నెలలుగా గౌరవ వేతనాలు ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చి 9 మాసాల కాలం అయ్యింది. కావున, "ఆశా" వర్కర్లకి వెంటనే వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. "ఐకెపి" వారికి కూడా గత 20 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. కావున, వారికి కూడా వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. గిరిజన, మారుమూల ప్రాంతాల్లో "పశుక్రాంతి పథకం" లో డాక్టర్లు అందుబాటులో లేకున్నా టీకాలు వేస్తూ వైద్య సేవలు చేస్తున్న సిబ్బందికి కూడా గౌరవ వేతనం ఇవ్వాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

3.00 మ. మిస్టర్ స్పీకర్: త్వరగా కంక్లూడ్ చేయండి. ఇప్పుడు సమయంమధ్యాహ్నం 3 గంటలు కావస్తున్నది.

శ్రీ సున్నం రాజయ్య: ఈ రోజు ఉదయం వాయిదా తీర్మానంలో మీరు నాకు కూడా అవకాశం ఇవ్వలేదు. రాష్ట్రంలోని బర్నింగ్ ఇష్యూ ఒకటి నా నియోజకవర్గంలో ఉంది. మొన్న వచ్చిన అకాల వర్షం కారణంగా వాదేడు, వెంకటాపురం మండలాల్లోని 10వేల ఎకరాల్లో కోసి ఉంచిన పంట కల్లాల్లో మునిగిపోయింది. ఆ విధంగా జరగడం వల్ల రైతులందరు చాలా తీవ్రంగా నష్టపోవడం జరిగింది. వీరంతా కూడా 20, 30 క్వింటాళ్ల ధాన్యం పండించే చిన్న చిన్న దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల రైతులు. వ్యవసాయ శాఖ మంత్రి గారు ఈ విషయంలో వెంటనే సర్వే జరిపి వారికి ప్రభుత్వం ద్వారా సహాయం అందించాల్సిన అవసరమున్నదని తెలియజేస్తున్నాను. నా నియోజక వర్గంలోని వాదేడు, వెంకటాపుర మండలాలతో పాటుగా ప్రక్కనే ఉన్న వరంగల్‌లోని ఏటూరునాగరం ప్రాంతంలో, మంత్రి గారి నియోజకవర్గంలో కూడా ఈ అకాల వర్షం వల్ల రైతులు అతలాకుతలం కావడం జరిగింది. కావున, ఈ రైతులందరిని ఆదుకోవాలని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. మేమిచ్చిన సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నాను. రేపు గవర్నర్ గారి ప్రసంగానికి రిప్లై ఇచ్చే సమయంలో ఈ విషయాలపై పూర్తి సమాచారాన్ని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ, నాకు మాట్లాడే ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదములు తెలియజేస్తున్నాను.

MR. SPEAKER: The House is adjourned to meet at 9.30 a.m., tomorrow.

(Then the House adjourned at 3.01 p.m., to meet again at 9.30 a.m., on Tuesday, the 10th March, 2015)

***